

ఉదయగిరి : గండిపాళెంలో అర్ధంతరంగా ఆగిపోయిన పనులు

# బోరుంటే నీరుండదు రెండూ ఉంటే పైపులైను ఉండదు!

- ఇదీ జిల్లాలో జలజీవన్ మిషన్ పరిస్థితి
- రూ. 305 కోట్ల పథకం అక్కరకు రాని వైనం
- గొంతులెండుతున్న గ్రామీణులు
- విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం

నెల్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటింటికి తాగునీటి కుళాయి ఇవ్వాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. 632 గ్రామ పంచాయతీల్లోని 1,912 నివాసిత ప్రాంతాల్లో 14,60,768 మంది జనాభాకు కుళాయిల ద్వారా పరిశుభ్రమైన నీటిని అందించడం ఈ పథకం లక్ష్యం. ఇందు కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 305 కోట్లు మంజూరు చేసింది. అయితే గత ప్రభుత్వం ఆ లక్ష్యాన్ని నీరుగార్చింది. దీంతో పథకం అమలు పక్కదారి పట్టింది. రూ. కోట్లు ఖర్చు అయ్యాయి తప్ప ఫలితం మాత్రం దక్కలేదు. బోరు వేసిన చోట కరెంటు ఉండదు. నీరున్న చోట బోరు వేయరు. ఈ రెండు ఉన్న చోట పైపులైన్లు వేయరు. ఇది జిల్లాలోని పథకం అమలు తీరు. అధికారుల లెక్కల్లో మాత్రం ఇప్పటికి నాలుగు లక్షల ఇళ్లకు తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు కానీ వాస్తవానికి అత్యధిక శాతం కుళాయిల్లో నీరు మాత్రం రావడం లేదు. అసలు ఈ పథకం అమలు తీరు తెన్నుల్లో ఏదో అక్రమాలు జరిగాయన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

**క్షేత్రస్థాయి సమాచారం ఇదిగో...**

- కావలి నియోజకవర్గం పరిధిలోని అల్లూరు మండలంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇస్కపల్లిలో పైపు లైన్లు ఏర్పాటు చేశారు కానీ తాగునీరు సరఫరా కావడం లేదు. మిగిలిన 12 గ్రామాల్లో అసలు పనులే ప్రారంభమే కాలేదు.
- ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడులో మొత్తం 35 గ్రామాలు ఎంపికయ్యాయి. తొలి విడతలో ఐదు గ్రామాలు పూర్తి చేశారు. బిల్లులు రాలేదు. రెండో విడతలో 17, మూడో విడతలో 13 గ్రామాల్లో పనులకు టెండర్లు పూర్తయి మూడేళ్లు అవుతున్నా ఇప్పటివరకు పనులే మొదలు కాలేదు. ఉదయగిరి మండలంలో కుళాయి కన్నెన్లు ఇచ్చినా ట్రాన్స్‌ఫార్మర్లు బిగించకపోవడంతో నీరు అందడం లేదు.
- కొండాపురం మండలం కొమ్మి పంచాయతీలో రెండు నెలలు మాత్రమే జలజీవన్ మిషన్ పథకం పనిచేసింది. ఆ తరువాత ఆగిపోయింది.
- కందుకూరు నియోజకవర్గం పరిధిలోని లింగసముద్రం మండలం సింగరాయపాళెంలో ఇంటింటికి కుళాయిలు బిగించారు. వాటర్ ట్యాంక్ కట్టారు. కానీ పైపు లైను వేయలేదు. పక్కనున్న వెంగలాపురం గ్రామ ట్యాంకు నుంచే సింగరాయపాలెంను నీరు ఇస్తున్నారు.

ఇవి ఉదాహరణలు మాత్రమే. జలజీవన్ పథకం పూర్తి స్థాయిలో పనిచేస్తున్న గ్రామాలు చాలా తక్కువ. కానీ అధికారుల లెక్కల్లో మాత్రం 90 శాతానికి పైగా ఇంటింటికి కుళాయిలు అమర్చి నీరు ఇస్తున్నట్లు చెబుతున్నాయి.

**● అధికారుల సమాచారం ఇది:**

ఆగస్టు 7వతేదీ నాటికి జిల్లాలో 3,98,266 ఇళ్లకు కుళాయిలు అమర్చినట్లు పేర్కొన్నారు. జిల్లా మొత్తంపై 4,60,415 ఇళ్లకు కుళాయిలు అమర్చాలన్నది లక్ష్యం కాగా అందులో 4లక్షల ఇళ్ల పూర్తయినట్లు చెబుతున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 57,334, కావలి, 36,378, కోవూరు64,708, నెల్లూరు రూరల్ 10,540, సర్వేపల్లి 73,196, ఉదయగిరి 65,541, వెంకటగిరి 33,840 ఇళ్లకు కుళాయిలు బిగించినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. అయితే ఈ పథకం నిర్వహణలో భారీగా అక్రమాలు జరిగాయన్న అనుమానంతో రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.



బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో వేసిన బోరులో వస్తున్న బురద నీరు



అల్లూరు : బీరంగుంటలో పనులు ప్రారంభం కాకపోవడంతో అక్కడే ఉన్న పైపులు



ఆత్మకూరు మండలం మురగళ్లలో అర్ధంతరంగా ఆగిన ఓహెచ్ఎస్ ట్యాంకు నిర్మాణం



బుధవారం రాత్రి వెంకయ్యస్వామికి నిర్వహించిన గజవాహన సేవ

## వెంకయ్యస్వామికి గజవాహన సేవ

వెంకటాచలం, ఆగస్టు 21: మండలంలోని గొలగమూడిలో జరుగుతున్న వెంకయ్యస్వామి 42వ ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం వేకువ జామున గోపూజ, అనంతరం సుప్రభాతసేవ, అభిషేకం, పూజ, హారతి, ప్రసాద వినియోగం, ఉత్సవ విగ్రహానికి అభిషేకం, సహస్ర నామార్చన కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 10 గంటలకు చినశేష వాహనంపై వెంకయ్యస్వామికి గ్రామోత్సవం, రాత్రికి గజవాహన సేవను నిర్వహించారు. ఈ సేవలను తిలకించడానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఊరేగింపు ముందు ఏర్పాటు చేసిన పలు వాయిద్య విన్యాసాలు భక్తులను ఉత్సాహపరిచాయి. ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం కార్యక్రమాలను పర్యవేక్షించారు. కాగా గురువారం ఉదయం వెంకయ్య స్వామికి అశ్వవాహన సేవ, రాత్రికి పెదశేషవాహన సేవను నిర్వహించనున్నారు.



చిన శేషవాహనంపై వెంకయ్యస్వామి

## జిల్లాలో ఎస్ఐల బదిలీలు

నెల్లూరు,(క్రైం),ఆగస్టు 21: జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ జీ కృష్ణకాంత్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల వివరాలు.. వరికుంటపాడు పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న కే తిరుపతయ్యను నెల్లూరు వీఆర్‌కు, కండలేరులో పనిచేస్తున్న కే కిషోర్‌బాబును అల్లూరుకు, అల్లూరు ఎస్ఐ పీ శ్రీనివాసులురెడ్డిని నెల్లూరు వీఆర్‌కు బదిలీ చేశారు. దిశ పోలీసు స్టేషన్‌లో ఉండి అటాచ్డ్‌పై డీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఎన్ కాంతికుమార్‌ను సైదాపురానికి, సైదాపురం ఎస్ఐ డీఎస్ విజయ్ కుమార్‌ను నెల్లూరు డీసీఆర్‌బీకి, వీఆర్‌లో ఉన్న కే అంకమ్మను ఉలవపాడుకి, ఉలవపాడులో ఉన్న ఏ బాజీరెడ్డిని నెల్లూరు వీఆర్‌కి,కొండాపురంలో ఉన్న బీ మహేంద్రను డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. కృష్ణపట్నం పోర్టులో ఉన్న ఎమ్ శివనాంచారయ్యను నెల్లూరు వీఆర్‌కి, నెల్లూరు వీఆర్‌లో ఉన్న ఎస్‌కె జిలానీని ఆత్మకూరుకు, ఆత్మకూరులో ఉన్న ఆర్ ముత్యాలరావును నెల్లూరు వీఆర్‌కి బదిలీ చేశారు. చిన్నబజారులో ఉన్న మహిళా ఎస్ఐ ఎస్‌డీ లతీఫున్నీషాను జలదంకికి, జలదంకి ఎస్ఐ ఆదిలక్ష్మి నెల్లూరు వీఆర్‌కి, నెల్లూరు రూరల్ ఎస్ఐగా ఉన్న కే స్వప్నను నవాబుపేట స్టేషన్‌కు బదిలీ చేశారు.



నెల్లూరు జీజీహెచ్ వద్ద జూనియర్ వైద్యుల నిరసన

# కోల్‌కతా ఘటనపై కొనసాగుతున్న ఆందోళనలు

- నెల్లూరు జీజీహెచ్ వద్ద జూనియర్ వైద్యుల నిరసన
- కొవ్వొత్తులతో న్యాయవాదుల ప్రదర్శన
- కోవూరులో జర్నలిస్టుల నిరసన

నెల్లూరు(వైద్యం) ఆగస్టు 21 : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా జూనియర్ వైద్యుల సంఘం చేస్తున్న ఆందోళన రోజురోజుకు ఉధృతమవుతున్నది. ఇందులో భాగంగా బుధవారం జూనియర్ వైద్యులు నెల్లూరు జీజీహెచ్ వద్ద నిరసన తెలిపారు. వారికి యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్ మాట్లాడుతూ కోల్‌కతా ఘటనపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నదని, జూడాలతోపాటు వైద్యులు కూడా ఆందోళన చేస్తున్నారని తెలిపారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసును స్వీకరించడం శుభపరిణామమన్నారు. నిందితులు ఎంతటి వారైనా వదిలి పెట్టకుండా కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సందానిబాషా, నగర అధ్యక్షుడు కమ్మటి శ్రీనివాసులు, సభ్యులు శ్రీనివాసరావు, జబ్బార్, పెంచలయ్య, మహేష్, శ్యామ్యూల్, రామాంజులు, రాజీవ్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ట్రంకురోడ్డుపై న్యాయవాదులు కొవ్వొత్తుల ప్రదర్శన

**● కొవ్వొత్తులతో లాయర్ల నిరసన**

నెల్లూరు (లీగల్) : కోల్‌కతా ఘటనపై నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం సాయంత్రం కోర్టు ప్రాంగణంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సంఘటనతో సంబంధం ఉన్న ఎంతటి వారినైనా శిక్షించాలని, ఇలాంటి దురాగతాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి దురాగతాలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం, న్యాయసానాలు కఠినచర్యలు తీసుకువాలని వారు నినదించారు. తొలుత కోర్టు ప్రాంగణంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపిన న్యాయవాదులు కోర్టు బయటకు వచ్చి ట్రంకు రోడ్డుపై నిందితులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎం.సుందరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**● కోవూరులో జర్నలిస్టులు..**

కోవూరు : కోల్‌కతా ఘటనకు నిరసనగా బుధవారం పట్టణంలో జర్నలిస్టులు కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన బజారుకూడలి వరకు సాగింది. అనంతరం బజారుకూడలిలో ప్రజాసంఘాలతో కలిసి మానవహారం ఏర్పాటుచేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని జర్నలిస్టులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పత్రికా విలేకరులు, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



కోవూరులో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న పాత్రికేయులు

## ఆలయాల ఆస్తుల పరిరక్షణకు కృషి చేయండి

**కలెక్టర్ ఆనంద్**

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 21 : జిల్లాలో దేవదాయశాఖ ఆస్తులు, భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో బుధవారం ఆయన దేవదాయశాఖ భూముల పరిరక్షణ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ఆలయాల పరిధిలో అన్యాక్రాంతమైన ఆస్తులను గుర్తించి, స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఆత్మకూరులోని కొలగాని రామయ్య, చౌల్ట్రీ స్థలాల్లో ఆక్రమించిన దుకాణాల తొలగింపుపై దృష్టి సారించాలన్నారు. ఆ స్థలాన్ని పేదలు ఆక్రమించి ఉంటే, వారికి ప్రత్యామ్నాయ స్థలాలను చూపాక తొలగించాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్యాక్రాంతమైన ఆలయాల భూముల స్వాధీనం కోసం అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, ఏఎస్పీ సౌజన్య, జిల్లా దేవ దాయ సహాయ కమిషనర్ జే.శ్రీనివాసరావు, డీపీవో సుస్మిత, ఆత్మకూరు ఆర్డీవో మధులత, కావలి ఆర్డీవో శీనానాయక్, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ ఆనంద్



## జిల్లాలో బంద్ ప్రశాంతం

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 21 : ఎస్సీ వర్గీకరణకు నిరసనగా బుధవారం జిల్లాలో నిర్వహించిన భారత్ బంద్ ప్రశాంతగా జరిగింది. బంద్‌లో మాలమహానాడుతోపాటు ఎస్సీ సంఘాలు, బీఎస్పీ, విద్యార్థి, ఉద్యోగుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌కు లోబడి ఉపకులాలను వర్గీకరించే హక్కును ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పిస్తూ ఈనెల ఒకటిన సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుకు నిరసనగా బంద్ జరిగింది.బంద్‌తో నెల్లూరు నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు మూత పడ్డాయి. వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆర్టీసీ బస్టాండ్ కేంద్రంగా నాయకులు బంద్ పాటించారు. దీంతో ఆర్టీసీ వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో బంద్ అంతంతమాత్రంగానే జరిగింది.

**● మాలమహానాడు, మాలల జేఏసీ రాస్తారోకో :**

బంద్‌లో భాగంగా నగరంలోని ప్రధాన ఆర్టీసీ కార్యాలయం వద్ద మాలమహానాడు రాష్ట్ర, జిల్లా నాయకులు, మాలల జేఏసీ ఆధ్వర్యంలో రాస్తారోకో జరిగింది. దీంతో బస్టాండు నుంచి ఇతర ప్రాంతాలకు, ఇతర ప్రాంతాల నుంచి బస్టాండులోకి వచ్చే బస్సులు గంటపాటు ఆగిపోయాయి. రాస్తారోకోను ఉద్దేశించి మాలమహానాడు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు స్వర్ణవెంకయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, ఈ తీర్పును వెంటనే రద్దు చేయాలని కోరారు. ఇది కేవలం మాలలను అణగదొక్కే ప్రయత్నమన్నారు. త్వరలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని తెలిపారు. సెప్టెంబరులో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ, నెల్లూరు ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఎంబేటి ఏసునాయుడు, నాయకులు బల్లి వెంకయ్య, లాలం పెంచలయ్య, స్వర్ణ నవీన్‌కుమార్, అరవ ప్రభాకర్, బల్లి శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేస్తున్న మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు

ఆర్టీసీ ఎదుట మోహరించిన పోలీసు బలగాలు



## చవితి చందాల విషయమై వివాదం, ఘర్షణ

● ఇరువురిపై కేసు నమోదు



గాయపడ్డ టీడీపీ నాయకుడు బెల్లంకొండ సురేష్



ఇంటిపై దాడిచేయడంతో కన్నీటి పర్యంతమైన రమణయ్య కుమార్తె రాధ

**బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు21:** నగర పంచాయతీ పరిధిలోని కట్టుబడిపాళెంలో వినాయకచవితి చందాల సేకరణ వివాదానికి దారితీశాయి. వడ్డిపాళెంలో ఓ సామాజిక వర్గానికి చెందిన యువకులు రెండురోజుల క్రితం బావిమిట్ట ప్రాంతానికి వెళ్లి చందాలు సేకరిస్తుండగా, ఆ ప్రాంతానికి చెందిన కొందరు బాలికలు తాడు అడ్డుపెట్టి చందాలు వసూలు చేస్తూ వీరిని కూడా డబ్బులు అడిగారు. దీంతో ఆ యువకులు బాలికలను వారించి వెళ్లిపోయారు. కొంతసేపటికి బావిమిట్ట మహిళలు వచ్చి ఆ యువకులను తిట్టారు. దీంతో ఘర్షణ జరిగింది. కాగా బుధవారం ఉదయం వడ్డిపాళెం నుంచి పొలానికి వెళుతున్న టీడీపీ నాయకుడు బెల్లంకొండ సురేష్ ప్రత్యర్థి వర్గంవారితో మాట్లాడుతూ మళ్లీ తగువులు పెట్టుకుంటే బాగుండదని హెచ్చరించాడు.ఈ కొంతసేపటి తర్వాత సురేష్ పొలం నుంచి వస్తుండగా, బావిమిట్ట ప్రాంతానికి చెందిన చంద్రగిరి రమణయ్యవర్గంవారు దాడి చేశారు. దీంతో ఆయనకు గాయాలయ్యాయి. దాడి విషయం తెలిసి సురేష్ వర్గంవారు కూడా చంద్రగిరి రమణయ్య ఇంటిపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. రమణయ్యతోపాటు కుటుంబ సభ్యులను గాయపరిచారు. గాయాలపాలైన ఇరువర్గాలవారిని బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేశారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ హైమారావు తెలిపారు.

## బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 21:** ఎదురెదురుగా వచ్చిన రెండు మోటారుబైకులు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలైన సంఘటన బుధవారం రాత్రి మండలంలోని గుడినరవ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. రవీంద్ర అనే వ్యక్తి ఉదయగిరి నుంచి గుడినరవ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. అదే సమయంలో వరికుంటపాడు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రమణయ్య, ఫణీంద్రలు ద్విచక్ర వాహనంపై ఉదయగిరి వస్తున్నారు. గ్రామ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గమనించిన స్థానికులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## మద్దూరుపాడులో మహిళకు..

**కావలి రూరల్:** మోటారు సైకిల్ ఢీకొని చింటు యోగి అనే మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం స్థానిక మద్దూరుపాడులో చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. శ్రీకాకుళం చెందిన యోగి కుటుంబం 18సంవత్సరాలుగా మద్దూరుపాడులోని రైస్ మిల్లులో పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు. కావలిలో చిల్లర సరుకులు తీసుకుని మద్దూరుపాడులో ఆటో దిగిన ఆమె జాతీయ రహదారి దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన ఆమెను కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతోంది.

## నిందితుడి అరెస్టు



అదుపులోకి తీసుకున్న నిందితుడితో ఎస్ఐ తిరుపతయ్య

**వరికుంటపాడు, ఆగస్టు 21:** ఈ నెల 18న రామాపురం గ్రామ సమీపంలోని జాతీయ రహదారికి వద్ద ఉన్న దుకాణంలో చోరీ చేసేందుకు ప్రయత్నించిన నిందితుడిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపతయ్య తెలిపారు. సీసీ కెమెరా ఫుటేజీలను ఆధారంగా తీసుకొని ప్రత్యేక నిఘా ఉంచి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. అతను ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం రామగోపాలపురం గ్రామానికి చెందిన రాగిపిండి మహేంద్రరెడ్డిగా నిర్ధారణ కావడంతో పక్కా సమాచారం అందుకొని వెలిగండ్లలో అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతని నుంచి రూ. 5వేల నగదుతో పాటు 6 సెల్‌ఫోన్లు, 10 స్కానర్లు, ఓ మోటారు బైకును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

## పాత కక్షలతోనే యువకుడి హత్య


● నిందితుల అరెస్టు : సీఐ సుబ్బారావు



హత్య కేసులో నిందితుల వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు

**నెల్లూరు(క్రైం), ఆగస్టు 21:** నెల్లూరులోని బీవీనగర్‌లో ఈ నెల 14న జరిగిన మన్నేపల్లి వేణు(23) అనే యువకుడి హత్య పాతకక్షల నేపథ్యంలోనే జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో నిందితుల వివరాలను ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు బుధవారం విలేకర్లకు వెల్లడించారు. బీవీనగర్‌కు చెందిన ఇంగిలాల మహేష్, షస్త్రక్ మదసిర్, ఉమ్మారెడ్డిగుంటకు చెందిన పెనగలూరు ప్రవీణ్, మరో ఇద్దరు మైనర్లతో వేణుకు పాతగొడవలున్నాయి. వారు వేణుపై కక్ష పెంచుకుని హత్యకు ప్రయత్నిస్తున్నారు. ఈ నెల 14వ తేదీ రాత్రి 9 గంటల ప్రాంతంలో వేణు ఇంటికి వెళుతుండగా బీవీనగర్ వినాయకస్వామి గుడి దగ్గరలోని రైల్వేట్రాక్ సమీపంలో నిందితులు ఐదుగురు అడ్డగించారు. విచక్షణారహితంగా కత్తులతో పొడిచి మోటారు సైకిళ్లపై పారిపోయారు. విషయం తెలుసుకున్న వేణు మేనమామ గడ్డమడుగు రమేష్ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు మోటార్ సైకిళ్లు, కత్తులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఏఎస్ఐ ఎస్‌టీ ప్రసాద్, హెచ్‌సీలు జీ బ్బారావు, మునిరావు, కానిస్టేబుళ్లు యూ మాలకొండయ్య, ఎస్ గోపాలయ్య, కే నాగరాజును ఇన్‌స్పెక్టర్ అభినందించారు. రివార్డ్‌కు సిఫార్సు చేస్తున్నామని చెప్పారు.

## పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



ఖలీల్ మృతదేహం

**సీతారామపురం, ఆగస్టు 21 :** మండల కేంద్రంలోని శ్రీమణికంఠ లాడ్జిలో బుధవారం ప్రకాశం జిల్లా కొమరోలు గ్రామానికి చెందిన ఖలీల్ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఖలీల్ తన అత్తగారి ఊరైన రంగనాయుడుపల్లిలో జరిగే వివాహానికి వచ్చారు. అందులో భాగంగా మంగళవారం రాత్రి సీతారామపురం లాడ్జిలో బస చేశాడు. బుధవారం మధ్యాహ్నం వరకు అద్దెకు తీసుకున్న గది తలుపులు తీయకపోవడాన్ని లాడ్జి సిబ్బంది గమనించారు. తలుపులు తీసి చూడగా నోటి నుండి నురుగురావడం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని అపస్మారకస్థితిలో ఉన్న అతన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే వ్యక్తి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ అనూష తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 123 |
| లేయర్ లైవ్ | 105 |
| స్కిన్ చికెన్ | 222 |
| స్కిన్‌లెస్ | 244 |
| లేయర్ | 178 |

### బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.6887 |
| వెండి కిలో ధర | రూ. 87,400 |
| వెండి ఒక గ్రాము | రూ. 90.40 |

## సోమశిలలో 26.432 టీఎంసీల నీరు నిల్వ

**అనంతసాగరం, ఆగస్టు 21:** సోమశిల జలాశయానికి ఎగువ నుంచి బుధవారం 11,898 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 26.432 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

# కనెక్షన్ల మంజూరులో జాప్యం

- వేలల్లో దరఖాస్తుల పెండింగ్
- విద్యుత్ కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణ
- వేధిస్తున్న మెటీరియల్ కొరత
- పట్టించుకోని అధికారులు

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 21 :** సార్వత్రిక ఎన్నికలకు ముందు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. అయినా అధికారులు నేటికీ కనెక్షన్లు ఇవ్వలేదు. దీనికితోడు గత తొమ్మిది నెలలుగా జిల్లాలో మెటీరియల్ కొరత తీవ్రంగా వేధిస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నా మెటీరియల్ లేనందున కనెక్షన్ల ఏర్పాటులో జాప్యం జరుగుతున్నది. మెటీరియల్ కొరత కారణంగా జిల్లాలో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాదిక్రితం వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు విద్యుత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



వ్యవసాయ విద్యుత్ కనెక్షన్

**● వేధిస్తున్న మెటీరియల్ కొరత**

జిల్లాలో విద్యుత్ మెటీరియల్ కొరత తీవ్రంగా ఉంది. కండక్టర్లు, కేబుల్ సరఫరా నిలిచిపోయింది. గతేడాది జిల్లాలో తుపాన్ ప్రభావంతో డెల్టాలో విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ సమయంలో విద్యుత్ స్తంభాలు, మెటీరియల్‌ను అధికంగా వినియోగించారు. అప్పటి నుంచి కాంట్రాక్టర్లు విద్యుత్ శాఖకు మెటీరియల్ సరఫరా చేయలేదు. దీనికితోడు గ్రామాల్లో ఆర్‌డీఎస్ కింద ప్రతి గ్రామానికి త్రిఫేజ్ లైన్ లాగుతున్నారు. దీంతో కాంట్రాక్టర్లు ప్రైవేటు వ్యక్తులకు సామగ్రి విక్రయిస్తుండడం, ట్రాన్స్‌కోకు విక్రయించకపోవడంతో సమస్య తీవ్రమైంది. మరోవైపు ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో సైతం జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేసరికి పక్షం రోజులు సమయం పడుతుందని రైతులు వాపోతున్నారు.

**● దరఖాస్తుల పెండింగ్**

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించి జిల్లాలో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్క ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు మండలాల్లో సుమారు వెయ్యి కనెక్షన్ వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని మెటీరియల్ కొరత తీర్చి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ త్వరితగతిన ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

● దుత్తలూరు మండలం వెంకటంపేటకి చెందిన ఓ రైతు మూడేళ్ల క్రితం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకొన్నాడు. అప్పటి నుంచి విద్యుత్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. గతేడాది అక్టోబరులో కనెక్షన్‌కు సంబంధించి డీడీలు సైతం చెల్లించాడు. అయినా ఇప్పటివరకు కనెక్షన్ ఇవ్వలేదు.

● దుత్తలూరు మండలం నందిపాడుకి చెందిన ఓ రైతు నాలుగేళ్ల క్రితం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకొన్నాడు. డీడీ సైతం చెల్లించాడు. అయినా ఇంత వరకు కనెక్షన్ ఇవ్వలేదు. అధికారులను ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదని ఆ రైతు వాపోయాడు.

> **మెటీరియల్ కొరత వాస్తవమే**
>
> గత కొన్నినెలలుగా మెటీరియల్ కొరత ఉన్నమాట వాస్తవమే. జిల్లా వ్యాప్తంగా మెటీరియల్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటులో జాప్యం జరుగుతుంది.
>
> **- కోటేశ్వరరావు, ఏడీఈ, ఉదయగిరి**



ఉదయగిరి విద్యుత్ కార్యాలయంలో అరకొరగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

## నేటి నుంచి రాష్ట్ర వెటరన్ క్రికెట్ పోటీలు

**నెల్లూరు (విద్య), ఆగస్టు 21:** వెటరన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో నెల్లూరులో రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వెటరన్ టీ-20 క్రికెట్ పోటీలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు పీ భానుప్రకాష్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుజబుజ నెల్లూరులోని సీఏఏ క్రికెట్ మైదానంలో సీనియర్ క్రీడాకారులు తాటిపర్తి సునీల్ కుమార్ స్మారకార్థం ఈనెల 22 నుంచి 25వతేదీ వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. హైదరాబాద్, అనంతపురం, కడప, గుంటూరు, కృష్ణ, నెల్లూరు జిల్లాలకు చెందిన వెటరన్ క్రీడాకారులు పాల్గొంటారన్నారు. హాజరయ్యే క్రీడా జట్లకు వసతి, భోజన సదుపాయాలను నిర్వాహకులే కల్పిస్తారన్నారు. పోటీలకు రంజీ, రాష్ట్రస్థాయికి ప్రాతినిధ్యం వహించిన ఉత్తమ క్రీడాకారులు కూడా హాజరవుతారని, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

## జడ్పీలో ముగ్గురికి ఉద్యోగోన్నతి

**నెల్లూరు(జడ్పీ), ఆగస్టు 21:** జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న ముగ్గురు ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ జడ్పీ సీఈవో కన్నమనాయుడు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీరాజ్ విభాగానికి చెందిన జూనియర్ సహాయకురాలు శ్రీలక్ష్మికి సీనియర్ సహాయకురాలిగా ఉద్యోగోన్నతి కల్పించి కోట ఎంపీడీవో కార్యాలయానికి బదిలీ చేశారు. కొల్లువారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న కే వెంకట్రాదిని ప్రమోషన్‌పై వెంకటగిరి ఎంపీడీవో కార్యాలయానికి బదిలీ చేశారు. టీపీ గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ సహాయకుడిగా పని చేస్తున్న రఘునాథ్ రెడ్డిని సూళ్లూరుపేట ఎంపీడీవో కార్యాలయానికి బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులను జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో చిరంజీవి అందజేశారు. ఉద్యోగోన్నతి కల్పించినందుకు ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్కాకుల పెంచలయ్య, ప్రధాన కార్యదర్శి దేవప్రసన్నకుమార్, కే భీమ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## పట్టాదారు పాసుపుస్తకం జారీలో ఆటోమ్యుటేషన్ విధానం ఇబ్బందికరం



పట్టాదారు పాసుపుస్తకం

**కలిగిరి, ఆగస్టు 21:** వైసీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆటోమ్యుటేషన్ విధానంతో పట్టాదారు పాసు పుస్తకం జారీలో ఇబ్బంది కరంగా మారింది. గతంలో ఓ రైతు కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన రిజిష్టర్ డ్యాకు మెంట్లతో గ్రామ సచివాలయం లేదా మీసేవా కేంద్రాల ద్వారా పట్టాదారు పాసుపుస్తకానికి దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత కాలంలో వెబ్ ల్యాండ్‌లో భూమి కొనుగోలు చేసిన రైతు పేరుతో 1బి, అడంగల్ కాపీలు ముందుగా వచ్చేది. కొద్ది రోజులకు సంబంధిత రైతుకు పట్టాదారు పాసుపుస్తకం పోస్టా ఫీసు ద్వారా నేరుగా ఇంటికి వచ్చేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో భూములు కొనుగోలు చేసే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆటో మ్యుటేషన్ విధానం ప్రవేశ పెట్టింది. దీని ద్వారా భూమి కొనుగోలు చేసిన వ్యక్తి పేర వెబ్‌ల్యాండ్‌లో ఇంగ్లిషు భాషలో 1బి, అడంగల్ వస్తుంది. గతంలో భూములు కలిగిఉన్న రైతులకు 1బి మాత్రం తెలుగుభాషలో, అడంగల్ కాపీలో మాత్రం ఇంగ్లీష్‌భాషలో భూ వివరాలు నమోదు అయ్యేవి. నూతనంగా భూములు కొనుగోలు చేసేవారికి ఆటోమ్యుటేషన్ తరువాత 1బి, అడంగల్ కాపీలు పూర్తిగా ఇంగ్లిషు భాషలో వచ్చాయి. ఈ కారణంతో పట్టాదారు పాసుపుస్తకం కోసం మరలా గ్రామ సచివాలయం లేదా మీ సేవ కేంద్రాల వద్దకు వెళ్లి ఇంగ్లిషు భాష నుండి తెలుగు భాషలోకి మార్పు చేసుకోవడం లేదా మ్యుటేషన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటేనే పట్టాదారు పాసుపుస్తకం వస్తుంది. ఆటో మ్యుటేషన్ విధానంలో 1బి, అడంగల్ కాపీలు తెలుగులో రావడంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం కూడా నేరుగా రైతుకు ఇంటి వద్ద అందేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

● సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పందిటి సుబ్బయ్య మాదిగ

**నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 21 :** ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యని ర్వాహక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం నెల్లూరులోని అంబేడ్కర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లా డారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఆ తీర్పునకు వ్యతిరేకంగా మాట్లాడే వారిపై రాజ ద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కోరారు. మాల, మాదిగలు అన్నదమ్ముల వంటి వారని, వర్గీకరణ ఆస్తి పంపకం లాంటిదేనన్నారు. ఈ వర్గీకరణకు మాలలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ గౌరవాధ్యక్షుడు కోటేశ్వరరావు, నాయకులు ఆనందరావు, కన్యకేశ్వరరావు, తాటిపర్తి రఘు, పలిగిలి చిన్నయ్య, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు 200 పని దినాలు కల్పించాలి

● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పుల్లయ్య



మాట్లాడుతున్న మంగళం పుల్లయ్య

**నెల్లూరు (వైద్యం), ఆగస్టు 21 :** ఉపాధి కూలీలకు ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళం పుల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 23వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రభుత్వం సభలు నిర్వహించి పంచాయతీలో చేయాల్సిన పనులు, ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించే విషయమై తీర్మానాలు చేయబోతోందన్నారు. ఈ నేపథ్యంలో కూలీలకు 200 పనిదినాలు కల్పించాలని, యంత్రాలు వాడకుండా తీర్మానాలు చేయాలని కోరారు. కూలీలకు 'ఉపాధి' పనులపై అవగాహన కల్పించాలని, వారం వారం చెల్లింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు, ఉపాధ్యక్షుడు పెద్దబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


## ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించండి

● డీపీవో సుస్మితారెడ్డి

**నెల్లూరు(జడ్పీ), ఆగస్టు 21 :** జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈనెల 23న ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీల హక్కులు, అర్హతలపై అవగాహన కల్పించాలని, పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, విస్తరణాధికారులను డీపీవో సుస్మితా రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆమె కార్యాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామసభల్లో సోషల్ ఆడిట్ ప్రాముఖ్యత, కొత్త పనుల కోసం ప్రతిపాదనలు తదితరాలపై చర్చించి ఆమోదింపచేయాలని సూచించారు. గ్రామసభ నిర్వహణపై రెండు రోజుల ముందు దండోరా వేయించి కూలీలందరూ హాజరయ్యేలా చూడాలన్నారు.

## నెల్లూరు, సంగం బ్యారేజీల పేర్ల తొలగింపు సమంజసమే

● మాకు సలహా ఇచ్చే స్థాయి కాకాణికి లేదు ● దేవదాయ శాఖ మంత్రి ఆనం



అన్న క్యాంటీన్‌కు రూ.1లక్ష విరాళం చెక్కును దాత శ్రీనివాసులు రెడ్డి నుంచి అందుకుంటున్న మంత్రి రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు

**నెల్లూరు(వైద్యం), ఆగస్టు 21 :** నెల్లూరు, సంగం బ్యారేజీల పేర్లు తొలగించటం సమంజసమేనని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. నెల్లూరులోని మంత్రి నివాసంలో బుధవారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పేర్ల మార్పు విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఆయన అనుమతి ఇస్తే వెంటనే పేర్లు మారుస్తామని తెలియచేశారు. మాకు సలహాలు ఇచ్చే స్థాయి మాజీ మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డికి లేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కడపలో అన్నమయ్య విగ్రహం తీసి రాజశేఖర్‌రెడ్డి విగ్రహం పెట్టినప్పుడు కాకాణి గోవర్దన్‌రెడ్డి ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యా లయం పేరును వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీగా మార్చి నప్పుడు ఎందుకు స్పందించలేదన్నారు. కాకాణి మరోమారు మాట్లాడితే తాను దీటుగా స్పందిస్తానని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాకతో సోమశిల ప్రాజెక్టుకు మహర్దశ పడుతోందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సోమశిల జలాశయం గేట్లు పాడయ్యాయని, ఇది మరో అన్నమయ్య డ్యాం లాగా మారుతుందేమోనన్న ఆందోళన వ్యక్తం చేశామని చెప్పారు. క్రస్టు గేట్లతోపాటు ఇతర మరమ్మతులు, ఆప్రాన్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, ఇందుకు కావాల్సిన నిధులు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. కండలేరు హెడ్ రెగ్యులేటర్ మరమ్మతులకు కూడా నిధులిస్తారన్నారు. సోమశిల మొదటి, రెండవ రిజర్వాయర్లు పూర్తయితే 20వేల ఎకరాల మెట్ట భూములకు నీరిందే అవకాశం ఉంటుందని మంత్రి ఆనం వివరించారు. గత ప్రభుత్వంలో ఇరిగేషన్ శాఖ మంత్రిగా అనిల్‌కుమార్ పనిచేసినా ఏం పట్టించుకోలేదని విమర్శించారు. గతంలో సోమశిల కాంట్రాక్టర్లుగా ఉన్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తెలంగాణ మంత్రి పొంగులేటి గత ప్రభుత్వం డబ్బులు ఇవ్వదన్న ఉద్దేశంతో మధ్యలోనే పనులు ఆపేశారని చెప్పారు. ప్రస్తుతం సోమశిలకు 11,800 క్యూసెక్కుల వరద నీరు వస్తోంద ని కండలేరుకు 2వేల క్యూసెక్కులను వదిలి తిరుపతి, తిరుమలకు మంచినీటితో పాటు 2 లక్షల ఎకరాలకు సాగునీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. దగదర్తి విమానాశ్రయాన్ని త్వరలో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్, కావలి శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి, నేతలు గిరినాయుడు, రంగమయూర్‌రెడ్డి, రాజానాయుడు, కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


> **అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం**
>
> **నెల్లూరు (సాంస్కృతికం) :** నెల్లూరులోని హరనాథపురానికి చెందిన చినిగ శ్రీనివాసులురెడ్డి అనే వ్యక్తి ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లకు రూ.1లక్ష విరాళం అందజేశారు. ఈ మొత్తానికి చెక్కును బుధవారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆయన నివాసంలో అందజేశారు. తాను బతికున్నంత వరకు ప్రతి ఏడాది ఆగస్టు 15వ తేదీన అన్న క్యాంటీన్‌కు రూ.1లక్ష విరాళం ఇస్తానని ఈ సందర్భంగా దాత శ్రీనివాసులురెడ్డి ప్రకటించారు.

## విద్యుత్ కోతలు లేవు

● ఎస్ఈ విజయన్

**నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 21:** జిల్లాలో ఎక్కడా విద్యుత్ కోతలు లేవని, వ్యవసాయానికి సైతం 9గంటలు విద్యుత్ సరఫరా ఇస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ విజయన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిర్వహణ పేరుతో కోతలు విధిస్తున్నారంటూ అక్కడక్కడా దుష్ప్రచారం జరుగుతోందన్నారు. అనధికారికంగా కూడా ఎక్కడా కోతలు లేవని, జిల్లాకు కేటాయించిన కోటాలోనే మిగులు విద్యుత్ ఉంటోందని తెలిపారు. జిల్లాకు రోజుకు 20ఎంయూ యూనిట్లు కోటా ఉండగా, 15ఎంయూ యూనిట్ల వాడకమే ఉంటోందన్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఏర్పడితే 1912 నెంబరుకుగానీ, 9133331912 నెంబర్‌కుగానీ వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

## సోమశిల నుంచి కండలేరుకు నీటి విడుదల



వరద కాలువ వద్ద పూజలు చేస్తున్న ఎస్ఈ రమణారెడ్డి



కాలువకు ప్రవహిస్తున్న జలాలు

**అనంతసాగరం, ఆగస్టు 21:** సోమశిల జలాశయంకు ఎగువ నుంచి వరద వస్తున్న తరుణంలో కండలేరు జలాశయంకు తెలుగు గంగ వరద కాలువ ద్వారా బుధవారం సాయంత్రం అధికారులు నీటిని విడుదల చేశారు. తొలుత కాలువ వద్ద ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఇంజనీర్లు గంగమ్మకు ప్రతేక పూజలు నిర్వహించి వాయినం వదిలారు. అనంతరం గేటు ఎత్తి 2,000 క్యూసెక్కులు వదిలారు. ఎస్ఈ మాట్లాడుతూ సోమశిల జలాశయంలో ప్రస్తుతం 26 టీఎంసీలకు పైగా నీటిమట్టం నమోదైందన్నారు. క్రమంగా కండలేరుకు నీటి మోతాదును పెంచుతామన్నారు. రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమశిలకు విచ్చేసిన విషయం తెలిసిందే.. ఆ సమయంలో కండలేరులో నీటి మట్టం పూర్తిగా తగ్గిందని ఇటు సోమశిల, అటు కండలేరు పరిధిలో రైతులకు నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీర్లకు సీఎం ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలో ఉన్నతాదికారుల సూచనతో వరదకాలువకు నీటి సరఫరా చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఈ బీ దశరథ రామిరెడ్డి, జేఈలు పాల్గొన్నారు.

**సమాచారం లేకుండానే..**

కాలువ నీటి విడుదలపై మందస్తు సమాచారం కరువైంది. ప్రజలకు అవగాహన లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. కాలువ పరిధిలోని నీటి సరఫరా సమాచారం లేక కాలువలో పశువుల, మనుషులు సంచరిస్తున్నాయని, సమాచారం ఇస్తే కాలువలో దిగకుండా జాగ్రత్త పడేవాళ్ల మని రైతులు చెబుతున్నారు. సమాచారం విలేకర్లకు తెలపకపోవడం ఇంజనీర్ల నిర్లక్ష్యానికి తార్కాణం.

# ప్రతి ఊరిలో గ్రామసభలు నిర్వహించాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

**ఆత్మకూరు, ఆగస్టు 21:** మండలంలోని ప్రతిఊరిలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించి ప్రజలకు ఉపాధి పనులపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సభలకు 30శాతం మంది ప్రజలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ సర్పంచ్ అధ్యక్షతన జరగనున్న సభలకు ప్రతి పంచాయతీకి ఒక మండలస్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించామన్నారు. ఉపాధిహామీ పథకంలో కూలీలకు కల్పించనున్న హక్కులు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనుల ఎంపిక, ప్రస్తుతం జరుగుతున్న పనుల వివరాలు తెలియజేయాలని వివరించారు. ప్రజాప్రతినిధులు, ప్రజలకు ముందుగా తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం ఏపీవో శిరీషా మాట్లాడుతు ఉపాధిపనులు ఎంపికపై వివరించారు. కార్యక్రమంలో మండల అధికారులు, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

## చేతిపంపు తొలగించి ఇంటికి నీటి సరఫరా

● శంకరనగరంలో వైసీపీ నేత నిర్వాకం

**అనంతసాగరం, ఆగస్టు 21:** వైసీపీ నేతల దుశ్చర్యలకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. మండలంలోని శంకరనగరంలో వైసీపీ నేత రవికుమార్‌రెడ్డి తన ఇంటి అవసరాల కోసం ఇంటి ముందు వీధిలో ఉన్న చేతిపంపు పైభాగాన్ని తొలగించి పైపులతో ఇంటికి కనెక్షన్ ఇచ్చి నీటిని వాడుకుంటున్నాడు. అధికారం ఉందన్న అహంతో నాలుగేళ్లుగా వాడుకొంటున్నట్లు స్థానికులు వాపోయారు. ఈ విషయం అధికారులకు తెలిసిన మౌనం దాల్చారు. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని అతనిపై చర్యలు తీసుకొని చేతిపంపును గ్రామస్థులు వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఆ డ్యూటీ మాకొద్దు బాబోయ్

● ఎంఈవోకు వెల్ఫేర్ అసిస్టెంట్ల వినతి

**వరికుంటపాడు, ఆగస్టు 21:** ఇప్పటికే అనేక పనులతో సతమతమవుతున్న మాకు మరుగుదొడ్ల ఫొటోలు తీసే డ్యూటీ వద్దు బాబోయ్ అంటూ బుధవారం మండలంలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చిన ప్రభుత్వం ఆ భారాన్ని తమపై మోపడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ప్రతినిత్యం పాఠశాలలకు వెళ్లి మరుగుదొడ్ల ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో నమోదుచేసే బాధ్యత నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో షావుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు.

## ఉదయగిరిని జిల్లా చేయాలని మంత్రికి వినతి



మంత్రి ఆనంకు వినతిపత్రం ఇస్తున్న జిల్లా సాధన ఉద్యమ నాయకులు

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 21:** అభివృద్ధిలో వెనుకబాటుతనంలో ఉండి వనరులలేమితో ఉన్న ఉదయగిరిని జిల్లా చేయాలని జిల్లా సాధన ఉద్యమనాయకులు రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కోరారు. బుధవారం వారు నెల్లూరు క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లో వెనుకబడిన 21 మెట్ట మండలాలను కలుపుతూ ఉదయగిరిని జిల్లాగా చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సాధన ఉద్యమ నాయకులు వేణుగోపాల్, షేక్ ఎండీ ఖాజా, మూర్తి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకు ప్రారంభం

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 21:** నందిపాడు సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఇండియన్ పెట్రోల్‌బంకును బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ చెంచలబాబు యాదవ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోదరుడు కాకర్ల వెంకటేలు ప్రారంభించారు. కార్యక్రమంలో పోలీసు హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ ఎం. చిరంజీవిరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, ఉదయగిరి టీడీపీ నేత బయ్యన్న, నాయకులు ఉండేలా గురవారెడ్డి, చప్పిడి హజరత్ యాదవ్, పెట్రోల్‌బంకు నిర్వాహకుడు నరసింహాయాదవ్ పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్ల పంపిణీ

**బిట్రగుంట :** పాత బిట్రగుంట ద్వారకానగర్‌లో వెలసిన షిర్డీ శేషసాయి మందిర ప్రాంగణంలో ఏలూరు డీఎస్పీ ఉప్పుటూరి నాగరాజు తన తండ్రి ఉప్పుటూరి వెంకటసుబ్బయ్య మూడో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నసంతర్పణ చేపట్టారు. స్వర్గీయ వెంకటసుబ్బయ్య సతీమణి రామతులసమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మందిర వ్యవస్థాపకులు కుట్టుబోయిన బ్రహ్మానందం, సాయిబాబా మందిర కమిటీ సభ్యులు పాలొన్నారు.

## సోమశిల రక్షణకు చర్యలు తీసుకోవడం హర్షణీయం



సీఎం చంద్రబాబు, మంత్రి ఆనం చిత్రపటాలకు నాయకుల పాలభిషేకం

**సంగం, ఆగస్టు 21:** సోమశిల జలాశయ ప్రాజెక్టు రక్షణకు నిధులు కేటాయించి పనులు పూర్తయ్యేలా సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకోవడం హర్షణీయం అని రైతు సంఘం జిల్లా నాయకులు పిట్టు రేణుకారెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక రైతులతో కలిసి సంగం బస్టాండ్‌లో సీఎం నారా చంద్ర బాబునాయుడు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చిత్ర పటాలకు పాలభిషేకం చేసి మాట్లాడారు. వైసీపీ హయాంలో సోమశిల జలాశయానికి వచ్చిన వరదతో ఆప్రాన్‌తో దెబ్బతిందన్నారు. అలాగే గేట్ల రోప్ దెబ్బతిని కొన్నిగేట్లు పనిచేయడం లేదన్నారు. దెబ్బతిన్న ఆప్రాన్‌కు మరమ్మతులు చేయాలని జిల్లా రైతాంగం తరుపున ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నాటి ముఖ్యమంత్రి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇచ్చిన హామీని 70రోజుల్లోనే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవడంపై సీఎం, అందుకు కృషి చేసిన మంత్రి ఆనంకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సంగం, పెరమన, కోలగట్ల, జంగాలదొరువు రైతులు పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీతకు సన్మానం



వెంకట్రావును సన్మానించిన ఉపాధ్యాయుల బృందం

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 21:** విధినిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జడ్పీ సీఈవో కన్నమనాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు నందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రికార్డు అసిస్టెంట్ నల్లబోతుల వెంకట్రావు. బుధవారం ఆయన్ను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఉపాధ్యాయులు మస్సూర్, ఫాతీమాజాన్, ఇలియాజ్, షాహీన, శ్రీరాములు, భాస్కర్, కృష్ణారెడ్డి, ఓబులరెడ్డి, శాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలి

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 21:** పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకుని మొక్కలు నాటి వాటి సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కళాశాలలో విద్యార్థులతో కలిసి ఔషధ మొక్కలు నాటి వాటి పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. మొక్కలను నాటి సంరక్షిస్తే పర్యావరణ పరిరక్షణ సాధ్యమౌతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జీ.రమేష్, సీనియర్ ప్రొఫెసర్లు పాల్, సునీత, నారాయణస్వామి, కిషన్‌తేజ, బాలచందర్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

**సంగం, ఆగస్టు 21:** తమ కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎరుకుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివ తెలిపారు. బుధవారం స్థానిక ఎస్టీ కాలనీలో ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఎరుకుల కులస్థులందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల ఎరుకుల సేవా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కట్టా శీనయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## అందుబాటులోకి గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్

**ఏఎస్ పేట, ఆగస్టు 21:** గాలికుంటు వ్యాధికి వ్యాక్సిన్ అందుబాటులో ఉందని పశువైద్య శాఖ ఏడీ రాఘునాథ్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని చిరమణ, రాజవోలు, ఏఎస్ పేటలోని పశువుల వైద్యశాలలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అవకాశాన్ని జీవ, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## డీఎస్పీ, సీఐలకు సన్మానం

**ఆత్మకూరు, ఆగస్టు 21:** ఆత్మకూరులో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ వేణుగోపాల్, సీఐ గంగాధరరావును బుధవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్, పలువురు జనసేన నేతలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జనసేన నేతలు ప్రసాద్, నాగరాజు, దాడి భాను తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆటో రవాణా ఖర్చులు

**ఆత్మకూరు, ఆగస్టు 21:** అప్పారావుపాళెం సమీపంలోని కొట్టాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం కంచి పరమేశ్వరరెడ్డి ఆటో రవాణా ఖర్చులకు రూ.45వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు జ్యోతి, చలపతి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ శ్రీలత, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు అల్లంపాటి సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణపై అవగాహన

**వరికుంటపాడు, ఆగస్టు 21:** పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులు చలపతి ఆధ్వర్యంలో ఆరోగ్య సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు, ఆంగ్లఉపాధ్యాయుడు ఆర్.నాగార్జున, శ్రీహరి, జలీల్‌సుల్తాన్, చిన్న రామయ్య తదితరులు పాల్గొన్నారు.









# కావలి

## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

# బంద్ పాక్షికం



అల్లూరులో బంద్ నిర్వహిస్తున్న దళితులు



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘం కార్యకర్తలు

**కావలి టౌన్, ఆగస్టు 21:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా ఇచ్చిన భారత్ బంద్ పట్టణంలోని కొన్ని విద్యాసంస్థలకే పరిమితమైంది. దళిత సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు నిరసన చేపట్టి ఎస్సీ రిజర్వేషన్‌కు, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేవలం కొన్ని విద్యాసంస్థలు మూత తప్పితే పట్టణంలో బంద్ ప్రభావం కనిపించలేదు. బంద్‌లో మాలమహానాడు నేతలు మొహం చాటేయడం చర్చనీయంశంగా మారింది.

**అల్లూరు:** దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్ బంద్ పిలుపులో భాగంగా మండలకేంద్రంలో దళితులు బంద్‌ను నిర్వహించారు. పాతబస్టాండు కూడలిలో వాహనాలను నిలిపివేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు మాట్లాడారు. కేంద్రం రాజ్యాంగంలోని ఎస్సీ, ఎస్టీ చట్టాలను నిర్వీర్యం చేస్తున్నట్లు ఆరోపించారు. రాబోవు రోజుల్లో ఎస్సీ, ఎస్టీలకు అండగా ఉండేలా చట్టాలను సవరించి దళిత, గిరిజన వర్గాల జీవనాన్ని నీరుగార్చేలా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మండిపడ్డారు. మాల, మాదిగలందరూ ఒకేతల్లి బిడ్డల్లా మెలుగుతుంటామని నేటికీ అలానే ఉంటామన్నారు.

**ఉలవపాడు:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం దేశవ్యాప్తంగా చేపట్టిన బంద్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. అంబేద్కర్ అసోసియేషన్, మాలమహానాడు, వివిధ ఎస్సీ సంఘాల నాయకులు ఉలవపాడుతోపాటు పలు గ్రామాల్లో ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు, కార్యాలయాలను బంద్ పాటించేలా చేసి పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వర్గీకరణ వ్యతిరేక వినతి పత్రాలు అందచేశారు.

## అభివృద్ధికి ఢోకా ఉండదు

● కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

● తుమ్మలపెంట రోడ్డుకు 1న శంకుస్థాపన.. జనవరి 1న ప్రారంభం

● మాజీ ఎమ్మెల్యే వంటేరుతో కలిసి జెండా ఐకాన్ సందర్శన





జాతీయ జెండా ఐకాన్ వద్ద ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, స్థానిక నేతలు

**కావలి, ఆగస్టు 21:** కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి ఢోకా ఉండదని అందుకు నిదర్శనమే సోమశిల ప్రాజెక్టును రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందర్శించి ప్రాజెక్టుకు నిధుల కేటాయించడం అని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణా రెడ్డి అన్నారు. పట్టణంలోని ట్రంకు రోడ్డులోని 100అడుగుల జాతీయజెండా ఐకాన్‌ను బుధవారం సాయంత్రం ఆయన మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డితో కలిసి సందర్శించి అక్కడ సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కావలి-తుమ్మలపెంట రోడ్డు పనులకు సెప్టెంబరు 1న మహిళలతో శంకుస్థాపన చేయిస్తామన్నారు. అంతకుముందు కావలి నుంచి 9కి.మీ తుమ్మలపెంట వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. జనవరి 1వ తేదీన రోడ్డ నిర్మాణ పనులు పూర్తి చేయించి నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటామన్నారు.

**ప్రజలు నీవెంట ఉన్నారు : మాజీ ఎమ్మెల్యే వంటేరు**

నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే కావ్య వెంటే ఉన్నారని మాజీ ఎమ్మెల్యే వంటేరు కొనియాడారు. వైసీపీ పాలనలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడని చెప్పారు. అవినీతిపరులను వదలవద్దని కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి సూచించారు.

## ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదినం

**కావలి టౌన్, ఆగస్టు21:** మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలు బుధవారం స్థానిక వెంకటేశ్వర థియేటర్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. మెగా అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి గా చిరంజీవి యువత జిల్లా నాయకులు ప్రముఖ న్యాయవాది చింతాల వెంకట్రావు పాల్గొన్నారు. ముందుగా చింతాల కేక్‌కట్ చేయగా అభిమానులు తినిపించారు. అనంతరం పెద్దఎత్తున బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో చేగు నారాయణ, సుందర్, బీ రాజు, సందీప్ పాల్గొన్నారు.

## వైభవంగా గ్రామోత్సవం



**బిట్రగుంట:** బోగోలు మండలం సుందరగిరివారి కండ్రిక పాతూరులో అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆంజనేయస్వామి, శంఖు, చక్ర నామాల గ్రామోత్సవంను వైభవంగా నిర్వహించారు. ఉదయం నవగ్రహహోమం, సాయంత్రం లక్ష్మీ కుంకుమ పూజను బ్రహ్మశ్రీ రాపూరు గోవిందరాజు ఆచారి యాగ్నీక బృందంతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు మాజీ సర్పంచు కోడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, స్థానిక టీడీపీ నేతల ఆహ్వానం మేరకు కావలి ఎమ్మెల్యే దగు మాటి వెంకట క్రిష్ణారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. రాత్రి ప్రతిష్ఠ విగ్రహాలకు పుష్పాభిషేకం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

## బీఎల్వోలకు శిక్షణ తరగతులు

**అల్లూరు:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల బీఎల్వోలకు తహసీల్దారు లక్ష్మీ నారాయణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, జాబితాలోని తప్పులు, సవరణలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిషనరు, ఎలక్షన్ సూపర్‌వైజర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత**

**వలేటివారిపాలెం:** పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు తెలిపారు. మండలంలోని శాఖవరం రైతు సేవా కేంద్రంలో మొక్కలు నాటారు. శాస్త్రవేత్త లు డాక్టర్ జి వెంకటేష్, డాక్టర్ నిహారిక, డాక్టర్ జ్యోతి, మయాంక్, వీఏఏ గౌతమి పాల్గొన్నారు.

## సాయిపేటలో రెండోరోజు ప్రత్యేక పూజలు

**కొండాపురం, ఆగస్టు 21:** సాయిపేటలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా బుధవారం విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం మహాగణపతిపూజ, అగ్నికార్యం, విశ్వకర్మసూక్త, పురుష సూక్త, నారాయణసూక్త, రుద్రనమక చమకసూక్త హోమాలు, అభయాంజనేయస్వామికి విశేష పూజలు చేపట్టారు. సాయంత్రం విగ్రహాలకు పంచామృత మహాస్నపనం, మహాగణపతి తదితర పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

## ఉపాధ్యాయ సంఘాల నేతలతో సమన్వయ సమావేశం నిర్వహించాలి

**లింగసముద్రం, ఆగస్టు 21 :** మండంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలతో సమన్వయ సమావేశం నిర్వహించాలని బీటీఏ, ఎస్‌టీయు ఉపాధ్యాయ సంఘాల నేతలు ఎంఈఓ-2 శివకుమార్‌ను కోరారు. బుధవారం లింగసముద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో బీటీఏ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కల్లగుంట మోహన్‌రావు, ఎస్‌టీయు మండల ప్రధాన కార్యదర్శి చాట్ల ప్రదీపరాజు, నేతలు ఎంఈఓ శివకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీసు సంబంధ విషయాలు, డిప్యుటేషన్స్, సెలవులు తదితర సమస్యలు ఉన్నాయని, పని సర్దుబాటులో కూడా అన్ని యూనియన్స్‌ను పిలిచి పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా సంఘాల నేతలు మాధవరావు, వెంకట్రావు పాల్గొన్నారు.

## బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి

**వలేటివారిపాలెం, ఆగస్టు 21 :** భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కందుకూరు నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త ఘట్టమనేని హరిబాబు కోరారు. మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో బీజేపీ మండల అధ్యక్షుడు డేవిడ్ కరుణాకరన్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో హరిబాబు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు. బీజేపీ నాయకులు ప్రతి గ్రామంలో పర్యటించి సమస్యలను తెలుసుకొని అధికారులతో చర్చించి పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేష్, వెంకటేష్, నరసింహం, అబ్రహం, మంగి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## మోటారుసైకిల్ చోరీపై ఫిర్యాదు

**కావలి రూరల్, ఆగస్టు21:** మోటారుసైకిల్ చోరీపై బుధవారం కావలి రెండో పట్టణ పోలీసులకు ఇంజనీరింగ్ విద్యార్థి పులిబండ్ల వినీత్‌కుమార్ ఫిర్యాదు చేశాడు. స్థానిక విట్స్ కళాశాలలో ఇంజనీరింగ్ చదివే వినీత్ కుమార్ నార్తు జనతాపేటలోని రామాలయం సమీపంలో రూంలో ఉంటున్నాడు. ఈ నెల 15న రూం వద్ద పార్కింగ్‌లో ఉంచిన బైక్ 16న ఉదయం కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ గోపీచంద్ కేసు నమోదు చేశారు.

## పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించండి : మోషే



లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న మోషే

**కందుకూరు, ఆగస్టు 21:** పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో కలిసి వినతి పత్రం అందజేసినట్లు టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధి కార ప్రతినిధి గోచిపాతల మోషే ఒక ప్రకటనలో తెలి పారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న కాలంలో అనేకమంది కుటుంబాలను సైతం పక్కనపెట్టి పార్టీని అధికారంలోకి తీసుకురావాలనే దృఢసంకల్పంతో పని చేశారని, అలాంటి వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేయగా, 2019- 24 మధ్యకాలంలో పార్టీని నమ్ముకుని కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులలో, పార్టీ పదవులలో మొదటి ప్రాధాన్యం ఇస్తామని లోకేష్‌బాబు భరోసా ఇచ్చారని ఆయన తెలిపారు.

## కొనసాగుతున్న ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు

**కలిగిరి, ఆగస్టు 21:** చంద్రారెడ్డిపాలెం కోదండరామ స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయం ప్రాంగణం వద్ద భక్తులు, నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. పంచగవ్య ఆరాధన, ప్రాసన, అధివాస హోమం, నిత్యహోతం, క్షీరాధివాస, జలధివాస, పంచగవ్యాధివాస కార్యక్రమాలను బ్రహ్మశ్రీవైఖానస ఆగమ భట్టారక టీటీడీ గోల్డ్ మెడలిస్ట్ నారాయణం వెంకటరమణ దీక్షితుల(తెల్లపాడు) ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు మూడుపూటలా అన్నసం తర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

**నేడు స్వామివార్ల విగ్రహస్థాపన, కల్యాణం**

ఆలయంవద్ద గురువారం సీతారామ, లక్ష్మణ హనుమత్ స్వామి వార్ల విగ్రహ స్థాపన, కలశస్థాపన అనంతరం సీతారామ కల్యాణం వేదపండితుల ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

## సొంత ఇంటి కల నెరవేర్చాలి

● ఎమ్మెల్యేకు యానాదుల వినతి

**కందుకూరు, ఆగస్టు 21:** నియోజకవర్గంలో యానాదుల కుటుంబాలకు నివాస స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని బుధవారం యానాది సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు చేవూరి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు యానాదులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యానాదులకు నివాస స్థలాలు ఇవ్వడమే కాదు.. వారందరికీ పక్కాగృహాలు నిర్మించి ఇచ్చే బాధ్యతను కూడా ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కొమరగిరి మాల్యాద్రి, యాటగిరి ప్రసాదరావు, మల్లవరపు సీత, చలంచర్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలపై ప్రచారం నిర్వహించాలి

**కావలి టౌన్, ఆగస్టు 21:** పంచాయితీరాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 23నుంచి జరుగనున్న గ్రామసభలపై ప్రచారం నిర్వహించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు తాళ్లూరు మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ విషయంపై బుధవారం కావలి ఈవో పీఆర్డీ మహేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట మండల కార్యదర్శి రాధాకృష్ణయ్య పాల్గొన్నారు.

**బిట్రగుంట:** గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో వెంకటసుబ్బారావు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మండలస్థాయి అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. అలాగే తహసీల్దారు సురేష్‌బాబు, ఏపీవో శ్రీనివాసులు మాట్లాడారు. ఉపాధి కూలీలు, రైతులు, స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో గ్రామసభలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ శ్వేత, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

**లింగసముద్రం:** అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకంపై జరిగే గ్రామసభలను జయప్రదం చేయాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, కందుకూరు ఏపీడి జె బాబూరావు పాల్గొన్నారు.

## కాండ్ర కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే దగుమాటి

**బిట్రగుంట:** బోగోలు మండలం నాగులవరంకు చెందిన జిల్లా టీడీపీ నాయకుడు కాండ్ర రఘురామ నాయుడు తల్లి కాండ్ర రాగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణా రెడ్డి బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎం.నాగేశ్వరావు, నాగరాజు, ఎల్.మాధవరావు, ఎం.వెంకయ్య, సుధాకర్, కాండ్ర సతీష్ నాయుడు, రమేష్‌రెడ్డి, శ్రీనివాసులు, బీజేపీ మండల కన్వీనర్ ఎస్ఎస్‌యాదవ్ ఉన్నారు.

## పాఠశాలలో మరుగుదొడ్డి లేక బాలికల అగచాట్లు


పట్టల మాటున బాలికల మరుగుదొడ్డి

బుచ్చిలోని బెజవాడ బుజ్జమ్మ జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఒక్కటంటే ఒక్క మరుగుదొడ్డి కూడా లేదు. దీంతో బాలికల పరిస్థితి దారుణంగా ఉంది. మొత్తం 910మంది విద్యార్థులు ఉండగా, వారిలో 870మంది బాలికలే. ఈ హైస్కూలుకు ఎదురుగా తలుపులు కూడా లేని మరుగు దొడ్డే వీరికి దిక్కు. వీరి దుస్థితిని గమనించి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి.

- బుచ్చిరెడ్డిపాళెం

## గ్యాస్ లీకేజీ పై కార్మికులకు అవగాహన


మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

**ముత్తుకూరు, ఆగస్టు 21:** కృష్ణపట్నంలోని పెట్రో గ్యాస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో బుధవారం గ్యాస్ లీక్‌పై మాక్ డ్రిల్ నిర్వహించారు. కలెక్టర్ ఆదేశానుసారం కెమికల్ లీకేజ్ మేనేజిమెంట్ అవగాహనలో భాగంగా ఈ మాక్ డ్రిల్ నిర్వహించామని పరిశ్రమల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర కుమార్ తెలిపారు. గ్యాస్ లీకేజీ జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై పరిశ్రమల కార్మికులకు అవగాహన కల్పించారు. ప్రమాదంలో గాయపడిన ముగ్గురు కార్మికులను ప్రథమ చికిత్స అనంతరం ముత్తుకూరు ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీవో మాలోల, డీపీఎం వీరశేఖర్, ఫ్యాక్టరీ మేనేజర్ జీవీ రావు, సచిన్, సెక్యూరిటీ సిబ్బంది, అదాని వైద్య సిబ్బంది, ఎస్‌డీఆర్ ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న మాలమహానాడు నాయకులు

**కోవూరు, ఆగస్టు 21:** ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ పట్టణంలోని బజారు కూడలిలో బుధవారం మాలమహానాడు కార్యకర్తలు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బల్లి వెంకయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. తీర్పును నిరసిస్తూ ఆందోళన చేపట్టామన్నారు. రాస్తారోకోలో మాలమహానాడు నాయకులు బల్లి శరత్‌కుమార్, పుట్టా పద్మమ్మ, నాపూరు బుజ్జయ్య, కొండమూరి దాస్, ఎల్లు శ్రీనివాసులు, గాలి రాజా తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తే కఠిన చర్యలు : సీఐ

**కొడవలూరు, ఆగస్టు 21:** మండలంలో అక్రమంగా మట్టి, ఇసుక, గ్రావెల్ తరలిస్తే చర్యలు తప్పవని సీఐ సురేంద్రకుమార్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు.

## హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి


ర్యాలీ చేస్తున్న యువత, తల్లిదండ్రులు

**ముత్తుకూరు, ఆగస్టు 21:** కోల్‌కత్తాలో ఇటీవల జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ బుధవారం ముత్తుకూరు ప్రధాన కూడలిలో యువత, తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, పాత చట్టాలను మార్చి వెంటనే శిక్షించే చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణకుమార్, మస్తానయ్య, బీజేపీ నాయకులు సంపత్‌కుమార్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, వెంకటస్వామి, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కట్టుబడిపాళెంలో దాడులపై డీఎస్పీ విచారణ

**బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 21:** స్థానిక కట్టుబడిపాళెంలో రెండు వర్గాల మధ్య వివాదం, దాడులపై రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులురెడ్డి బుచ్చి కొత్త సీఐ శ్రీనివాసులురెడ్డి, బదిలీ అయిన సీఐ హైమావులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దాడులు, ఘర్షణకు సంబంధించి స్థానికులను విచారించారు. ఓ వర్గంకి చెందిన ఇంటిపైన దాడికి సంబంధించి ఇంటిని పరిశీలించి పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సీఐ శ్రీనివాసులురెడ్డిని ఆదేశించారు.

## వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న వీసీ

**వెంకటాచలం, ఆగస్టు 21:** చదువుతోపాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు విద్యార్థులకు సూచించారు. స్థానిక వీఎస్‌యూలో బుధవారం జిల్లా సెట్నెల్, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కేరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సెట్నెల్ ఇన్‌చార్జ్ వీఈవో వై వెంకటయ్య, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ వీ సురేష్‌బాబు, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం హనుమారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## అదనపు బోరు, మోటార్ ఏర్పాటు

**ముత్తుకూరు, ఆగస్టు 21:** మండలంలోని పిడతాపోలూరు పంచాయతీలో సీతారెడ్డి తోట గ్రామస్థుల కోసం బుధవారం స్థానిక టీడీపీ నాయకులు దండు శ్రీనివాసులు అదనపు మంచినీటి బోరు, మోటారును ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు సరఫరా కావడంలేదని గ్రామస్థులు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు అదనపు బోరు, మోటారును ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



## అక్రమార్కులను కఠినంగా శిక్షించాలి

● ఎమ్మెల్యే సోమిరెడ్డికి టీడీపీ నేతల వినతి


సోమిరెడ్డిని కలిసిన మల్లికార్జునపురం టీడీపీ నాయకులు

**తోటపల్లిగూడూరు, ఆగస్టు 21:** వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలో అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని మల్లికార్జునపురం టీడీపీ నాయకులు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కోరారు. బుధవారం వేదాయ పాలెంలో సోమిరెడ్డి నివాసంలో ఆయనను కలిశారు. జగనన్న కాలనీలో అసలైన లబ్ధిదారులకు స్థలాలు కేటాయించలేదని, గిరిజనులకు ఇళ్ల కట్టిస్తానని చెప్పి వారికి వచ్చిన కాంక్రీటు, స్టీల్‌ను అమ్మేసి ఆగ్రామ వైసీపీ నేత సొమ్ము చేసుకుని గిరిజనులను బెదిరిస్తున్నారని, 12 గృహాలకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా బిల్లులు చేసుకున్నారని ఎమ్మెల్యేకు తెలిపారు. గ్రామంలో సమస్యలను పరిష్కరించి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వారిలో తాళ్లూరు వెంకటరమణయ్య, జీవరత్నం, గ్రామ టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### 'సోమిరెడ్డిపై కాకాణి ఆరోపణలు అవాస్తవం'

**పొదలకూరు:** మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని స్వర్ణ లేఅవుట్ నిర్వాహకులు మల్లిశెట్టి శివశంకర్, సోమ భాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక స్వర్ణ లేఅవుట్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచనల మేరకు చట్టపరమైన అన్ని అనుమతులతోనే పొదలకూరులో ప్లాట్ల వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. కాగా, అనుమతుల కోసం అధికారులకు, నాయకులకు లంచాలు ఇచ్చామని మాపై అభియోగాలు వస్తున్నాయని, వాటిలో వాస్తవం లేదన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధం

● బుచ్చి నగర పంచాయతీ కమిషనర్

**బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 21:** నగర పంచాయతీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధించినట్టు నగర పంచాయతీ కమిషనర్ ఈవీ రమణబాబు తెలిపారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక కల్యాణ మండపాల యజమానులతో సమావేశం నిర్వహించారు. వేస్ట్ మేనేజిమెంట్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధించినట్లు, వాటిని అనుమతించవద్దని కోరారు. ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరచర్యలుంటాయని హెచ్చరికలు చేసి నోటీసులు పంపిస్తామన్నారు. వివాహాలు ఇతర వేడుకల్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా మున్సిపల్ వాహనాల్లో మాత్రమే వేయాలని కోరారు. సమావేశంలో కల్యాణ మండపాల యజమానులు పాల్గొన్నారు.

# నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

మతాలు, పార్టీలకు అతీతంగా

## గణేష్ ఉత్సవాలు

● 11న నిమజ్జనం : ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి


గణేష్ ఘాట్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తదితరులు

**నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 21 :** నగరంలో వినాయక చవితి ఉత్సవాలను పార్టీలు, మతాలకు అతీతంగా అంగరంగ వైభవంగా జరుపుకోవాలని రూరల్ శాసన సభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సెప్టెంబరు 7 నుంచి 11వతేదీ వరకు జరిగే గణేష్ ఉత్సవాలకు ఇరుకళల పరమేశ్వరి ఆలయం సమీపంలోని నెక్లెస్‌రోడ్డు గణేష్ ఘాట్ వద్ద ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. కమిషనర్ సూర్యతేజకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది గణేష్ ఘాట్‌లో దాదాపు రూ.86.17లక్షలతో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఘాట్ మరమ్మతులు, నెక్లెస్‌రోడ్డు సుందరీకరణ పనులు కూడా చేస్తారని తెలిపారు. నెక్లెస్ రోడ్డులో గణేష్ ఉత్సవాల సందర్భంగా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, గణేష్ మండపాల ఏర్పాట్లకు సింగిల్ విండో విధానాన్ని కమిషనర్ ఏర్పాటు చేసి ఉత్సవ నిర్వాహకులకు సహకరిస్తారని తెలిపారు. ఇళ్లలో పూజించిన గణేష్ విగ్రహాల నిమజ్జనం 7వతేదీ నుంచే జరుగుతుందని, అన్ని ఏర్పాట్లు వసతులు ఉంటాయని తెలిపారు. పెద్ద విగ్రహాల నిమజ్జనం 11వతేదీ ఒక్కరోజే జరుగుతుందని, ఉత్సవ నిర్వాహకులు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, బయ్యా శ్రీనివాసులు, రాజానాయుడు, వేలూరి మహేష్, కమలాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

### అర్బన్ సీడీపీవో కార్యాలయం ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 21 : నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన నెల్లూరు అర్బన్ స్త్రీ శిశుసంక్షేమశాఖ కార్యాలయాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జాతరను తలపిస్తున్నాయన్నారు. విశాలమైన భవంతిలో అర్బన్ సీడీపీవో కార్యాలయం ఏర్పాటు కావటం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, అర్బన్ ఐసీడీఎస్ అధికారి అన్నపూర్ణ, ఊరందూరు సురేంద్రబాబు, అబ్దుల్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమిలో న్యాయం జరగడం లేదు

● కందలపాడు గ్రామ బీజేపీ నాయకులు



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

**నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 21 :** తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో బీజేపీకి న్యాయం జరగడంలేదని సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం మండలం కందలపాడు గ్రామ నాయకులు పీ పెంచలయ్య, సీహెచ్ చినకొండయ్య, వీ పెంచల ప్రసాద్ ఆరోపించారు. బుధవారం వారు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఓట్లపరంగా కందమూరు గ్రామంలో బీజేపీ బలంగా ఉందని తెలిపారు. దీని ప్రకారం ప్రభుత్వ పథకాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగాల్లో 10శాతం వాటా ఇచ్చేలా ఒప్పందం ఉందన్నారు. కానీ సర్వేపల్లి ఎమ్మెల్యే కూటమి ప్రభుత్వ ఒప్పందాన్ని ఖాతరు చేయక తమను ఇబ్బందిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో కందమూరు గ్రామం పేరు లేకుండా చేశారని ఆరోపించారు. ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పీ విజయలక్ష్మిని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సస్పెండ్ చేయించగా తాము కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నామన్నారు. తాజా ఎన్నికల్లో కూటమి తరఫున పనిచేస్తే కందమూరుకు ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం, ఉపాధి హామీ పనులు ఇస్తామని సోమిరెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. గెలిచిన తర్వాత తమను పట్టించుకోవడంలేదని, ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం గురించి అడిగితే రూ.3లక్షలు డిమాండ్ చేస్తున్నారని వాపోయారు. 10 శాతం వాటాను కందమూరులో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## ఎంబీఏలో 'కృష్ణచైతన్య'కు ఉత్తమ ఫలితాలు


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ కృష్ణారెడ్డి

**నెల్లూరు (విద్య), ఆగస్టు 21:** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఎంబీఏ మూడో సెమిస్టర్ ఫలితాల్లో నగరంలోని కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఆ కళాశాల డైరెక్టర్లు డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన ఆర్ సాయిహర్షిత 693 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, ఆర్ సుష్మ, ఎస్‌కే లతీషా 692 మార్కులతో ద్వితీయస్థానం, కే సూర్యతేజ 689 మార్కులతో తృతీయ స్థానం సాధించారని చెప్పారు. కళాశాలలో అనుసరించే అత్యున్నత విద్యా ప్రమాణాలే తమ విజయాలకు కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పీ రాణా ప్రమోద్‌రెడ్డి, అకడమిక్ డీన్ మల్లికార్జునయ్య, అడ్మిన్ డీన్ జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ పీ ప్రసాద్ పాల్గొన్నారు.

## దిశ పోలీసు డీఎస్పీ బదిలీ

**నెల్లూరు(క్రైం), ఆగస్టు 21:** రాష్ట్ర వ్యాప్తంగా 26 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. అందులో భాగంగా నెల్లూరు దిశ డీఎస్పీగా ఉన్న టీ సాయినాథ్‌ను చిత్తూరు డీఎస్పీగా బదిలీ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 7వ తేదీ నెల్లూరు దిశ డీఎస్పీగా సాయినాథ్ జిల్లాకు వచ్చారు.

## విద్యాసంస్థల బస్సుల్లో రవాణా అధికారుల తనిఖీలు



స్కూల్ బస్సు పత్రాలు పరిశీలిస్తున్న ఆర్టీఏ అధికారులు

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 21:** ఉప రవాణా కమిషనర్ ఆదేశాల మేరకు నిబంధనలు పాటించని విద్యాసంస్థల బస్సుల్లో బుధవారం ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేశారు. నగరంలోని ముత్తుకూరు సెంటర్, అయ్యప్పగుడి సెంటర్, నవాబుపేట ప్రాంతాల్లో ఈ తనిఖీలు జరిగాయి. రవాణా శాఖ అధికారి గోపీనాయక్ మాట్లాడుతూ ఫిట్‌నెస్ లేని బస్సులు, త్రైమాసిక పన్ను చెల్లించని, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీల్లో నాలుగు విద్యాసంస్థల బస్సులను స్వాధీనం చేసుకున్నామని, వాహన కండిషన్ సరిగా లేని వాహనాలను గుర్తించి వాటిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. నిబంధనలు పాటించని వాహనాలకు రూ.1.50 లక్షలు అపరాధ రుసుము వేసి వసూలు చేశామన్నారు. వాహన తనిఖీల్లో అధికారులు రాంబాబు, స్వప్నిల్‌రెడ్డి, పూర్ణచంద్రా రావు, విఘ్నేశ్వరలాల్ పాల్గొన్నారు.

## ఢిల్లీ కమిటీ సభ్యులు రెడ్‌క్రాస్ సందర్శన

**నెల్లూరు(వైద్యం) ఆగస్టు 21 :** ఇండియన్ రెడ్‌క్రాస్ నెల్లూరు జిల్లా శాఖను న్యూఢిల్లీకి చెందిన రెడ్‌క్రాస్ సభ్యులు బుధవారం సందర్శించారు. క్యాథలిన్ మేరీ మార్టిన్, జెనీవా, జాన్‌జార్జి, రాణి విభూషిత తదితరులు నగరంలోని జిల్లా రెడ్‌క్రాస్ రక్తనిధి, దివ్యాంగుల కేంద్రాన్ని సందర్శించారు. కేన్సర్ ఆసుపత్రి, తలసేమియా డేకేర్ సెంటర్, ఏఆర్‌వీ క్లినిక్, జనరిక్ మెడికల్ షాపును పరిశీలించి, అక్కడ అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులను అభినందించారు. అనంతర రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు జీన్ హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ అజయ్ బాబు 59వ పుట్టినరోజును పురస్కరించుకుని 106వసారి రక్తదానం చేశారు. మరికొందరు కూడా రక్తదానం చేశారు. రక్తదానం అవసరాలను గుర్తించి విరివిగా రక్తదానం చేయాలని ఢిల్లీ రెడ్ క్రాస్ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, విజయకుమార్‌రెడ్డి, కలికిశ్రీహరిరెడ్డి, బిరదవోలు వెంకురెడ్డి, శ్రీరంజనీ, సాయిరాం, బలరామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానాన్ని పరిశీలిస్తున్న న్యూఢిల్లీ కమిటీ సభ్యులు

### జీజీహెచ్‌లో మహిళకు 5 కిలోల కణితి తొలగింపు

**నెల్లూరు(వైద్యం), ఆగస్టు 21 :** నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స జరిగింది. బుధవారం ఓ మహిళ మోకాలి పైభాగంలో ఏర్పడిన 5 కిలోల కణితిని వైద్యులు తొలగించారు. వివరాలు ఇలా ఉన్నాయి... జిల్లాలోని చేజెర్లకు చెందిన ఏళ్లజెర్రి రమణమ్మ (62) కుడి తొడపై పెద్ద కణితి 20 ఏళ్లుగా ఉంది. అయితే ఈ కణితి వల్ల చాలా ఇబ్బందులు ఎదురవటంతో పలు ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించారు. ఆ గడ్డ నరాలకు అనుకుని ఉండటంతో ఎవరూ శస్త్రచికిత్స చేసేందుకు ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో బాధితురాలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సంప్రదించింది. అక్కడ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ సుహాసిని, డాక్టర్ ఉమామహేశ్వర్ అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, కణితిని శస్త్ర చికిత్స ద్వారా విజయవతంగా తొలగించారు. ప్రస్తుతం బాధితురాలు కోలుకుంటోంది.

### 29న 5కే మారథాన్ రన్

**నెల్లూరు(వైద్యం), ఆగస్టు 21 :** హెచ్‌ఐవీ, ఎయిడ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 29వ తేదీ ఉదయం 6 గంటలకు 5 కిలోమీటర్ల మారథాన్ రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ అనుమతితో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, స్పోర్ట్స్ అథారిటీ, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17 నుంచి 25 ఏళ్ల వయసున్న వారు ఇందులో పాల్గొనాలని కోరారు. వారు చదువుతున్న కళాశాల ఐడీ కార్డుతో ఏసీ స్టేడియం వద్ద ఈ నెల 27వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మారథాన్ రన్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారికి రూ.7వేలు, రూ.4వేలు బహుమతులుగా అందిస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు వారు అర్హులవుతారన్నారు.

### రేపు ఆంధ్రకేసరి జయంతి

● రాష్ట్ర పండుగగా నిర్వహణ

**నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 21 :** ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి శుక్రవారం రాష్ట్ర పండుగగా జరుగుతుందని మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 9గంటలకు కూరగాయల మార్కెట్ సమీపంలోని టంగుటూరు ప్రకాశం పంతులు విగ్రహానికి ఆంధ్రకేసరి అభిమానులు తరలి వచ్చి నివాళులు అర్పించాలని కోరారు.

### నేడు శ్రీచక్ర నవావరణ పూజలు

**నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 21 :** పొగతోట ఆదిశంకరా ధ్యాన మందిరంలో గురువారం ఉదయం శ్రీచక్ర నవావరణ పూజలు జరుగుతాయని మందిరం మేనేజరు చక్రాల వెంకటలక్ష్మీ నరసింహం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా మండలి ఆధ్వర్యంలో సౌందర్య లహరి, లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం, రామానంద భారతీ స్వామీజీ అనుగ్రహ భాషణం, అన్న సంతర్పణ జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

### గునుకుల కిషోర్ జన్మదిన వేడుకలు

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 21:** జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ జన్మదిన వేడుకలను మంగళవారం రాత్రి నగరంలోని గాంధీబొమ్మ వద్ద అభిమానులు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్‌చేసి సందడి చేశారు. కిషోర్ మాట్లాడుతూ జనసైనికులు ఓ వ్యక్తిని అభిమానిస్తే ఎంతలా ఆరాధిస్తారో వారి అభిమానం చూస్తుంటే అర్థం అవుతుందన్నారు.

### తాగునీటిని తనిఖీ చేయండి

● ఇంజనీర్లను ఆదేశించిన కమిషనర్


తాగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

**నెల్లూరు(సిటీ), ఆగస్టు 21 :** నగరంలో ప్రజలకు రోజూ సరఫరా అవుతున్న తాగునీటిని రోజువారీగా తనిఖీ చేయాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగర శివార్లలోని సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు ద్వారా నగరంలోకి ప్రవేశిస్తున్న నీటిని యంత్రాల ద్వారా పరిశీలించారు. ప్రజలు తాగే నీటిపై రోజువారీ తనిఖీ ఉండాలన్నారు. నీరు కలుషితం కాకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం పలు ప్రాంతాల్లో బుల్లెట్‌పై తిరుగుతూ పారిశుధ్యాన్ని పరిశీలించారు.

# విస్తరణ దిశగా విమానాశ్రయం

- మరిన్ని నగరాలకు విమానాలు
- అంతర్జాతీయ సర్వీసులకోసం రన్‌వే విస్తరణ పనులు పూర్తి



విమానాశ్రయ డైరెక్టర్ శ్రీనివాసరావు



ఏటీసీ బిల్డింగ్ నిర్మాణం

రేణిగుంట, ఆగస్టు 21: తిరుపతి విమానాశ్రయం నుంచి దేశంలోని పలు నగరాలకు విమాన సర్వీసులు త్వరలో విస్తరించనున్నాయి. రేణిగుంటలోని విమానాశ్రయం నుంచి వారంలో నాలుగు రోజులు 14, మిగిలిన 3 రోజులు 13 విమాన సర్వీసులు విశాఖపట్టణం, హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, బెల్గామ్, ఢిల్లీ నగరాల నుంచి నడుస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఇక్కడినుంచి ముంబై, అహ్మదాబాద్, కోల్‌కత్తా, అలహాబాద్, మధురై, తిరుచ్చి, తిరువనంతపురం విమానాశ్రయాల నుంచి సర్వీసులు నడిపేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదనల పట్ల సానుకూలంగా స్పందించిన పలు విమాన సంస్థలు తిరుపతికి విమాన సర్వీసులు పెంచనున్నాయి. అయితే ఈ సర్వీసులు తిరుపతికి నేరుగా కాకుండా కనెక్టింగ్ విమానాల ద్వారా నడిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. భవిష్యత్తులో ఈ సర్వీసుల ద్వారా ప్రయాణికులు పెరిగితే ఆయా నగరాల నంచి తిరుపతి విమానాశ్రయానికి నేరుగా సర్వీసులు నడిపేందుకు అవకాశం ఉంటుంది.ఈ విషయంపై ఎయిర్‌పోర్టు డైరెక్టర్ శ్రీనివాసరావును అడగ్గా దేశంలోని పలు ప్రధాన నగరాల నుంచి తిరుపతి విమానాశ్రయానికి సర్వీసులు నడిపేందుకు కొన్ని సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. ఇప్పటికే అంతర్జాతీయ విమానాలు ల్యాండయ్యేందుకు రన్‌వే పనులు పూర్తయ్యాయని,ఢిల్లీలో వున్న డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) పరిశీలించి అనుమతులు ఇవ్వడం కూడా జరిగిందన్నారు.రన్ వే మరింత విస్తరణ కోసం, ప్రత్యేక లైటింగ్ ఏర్పాట్లకు 11.11 ఎకరాలు అవసరం ఉండగా రాష్ట్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా సానుకూలంగా స్పందించిందన్నారు. త్వరలో భూమిని సర్వే చేసి విమానాశ్రయానికి అందజేయనున్నారని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఏటీసీ బిల్డింగ్ పనులు రూ.47కోట్ల వ్యయంతో జరుగుతున్నాయని, గతంలో ఉన్న టవర్ కన్నా అధికంగా 18 మీటర్లు వెడల్పు కలిగిన ఏటీసీ టవర్‌ను నిర్మిస్తున్నామన్నారు.



## తిరుమలలో మెగాస్టార్

సినీ హీరో చిరంజీవి బుధవారం సాయంత్రం తిరుమలకు వచ్చారు.గురువారం తన పుట్టినరోజు సందర్భంగా శ్రీవారి ఆశీస్సుల కోసం అమ్మ అంజనాదేవి, భార్య సురేఖ, కుమార్తె శ్రీజ, మనవరాలు నవిష్కలతో కలిసి కొండ పైకి చేరుకున్నారు.

## మీరు లాకర్ తీసుకుని ఏడాది అవుతోంది!

- ఫైన్ కట్టండి... లేకుంటే ఆధార్ బ్లాక్ చేస్తాం
- భక్తులను బెదిరించి దోచుకుంటున్న అపరిచితుడు
- టీటీడీ విజిలెన్స్ విచారణతో వెలుగులోకి

తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో సరికొత్త అక్రమం వెలుగు చూసింది. 'మీరు లాకర్ తీసుకుని దాదాపు ఏడాది అవుతోంది. మీరు ఖాళీ చేయకపోవడం వల్ల ఫైన్ పడింది. కట్టకుంటే మీ ఆధార్ కార్డును బ్లాక్ చేస్తాం' అంటూ ఓ యువకుడు శ్రీవారి భక్తులను బెదిరిస్తూ అందినకాడికి దోచుకుంటున్నాడు. తిరుమలలో బస చేసేందుకు గదులతో పాటు యాత్రికుల వసతి సముదాయాల్లో లాకర్లు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే.గదులు లభించని చాలామంది భక్తులు ఈ లాకర్లపైనే ఆధారపడుతుంటారు. లాకర్లలో లగేజీని భద్రపరుచుకుని దర్శనమయ్యాక తీసుకుని వెళ్లిపోతుంటారు. లాకర్ పొందే సమయంలో భక్తులు తమ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.ఇటీవల ఓ యువకుడు కొంతమంది భక్తులకు ఫోన్ చేసి వారు తిరుమలకు వచ్చిన తేదీ, లాకర్ తీసుకున్న ప్రాంతం, ఆధార్, సెల్‌నెంబరు చెబుతున్నాడు.ఇప్పటివరకు లాకర్ ఖాళీ చేయకపోవడంతో తమ ఆడిట్‌లో ఫైన్ పడిందని, ఆ సొమ్ము కట్టకపోతే ఇకపై దర్శనాలు, గదులు, లాకర్లు తీసుకునే వీల్లేకుండా ఆధార్ కార్డును బ్లాక్ చేస్తామని బెదిరిస్తున్నాడు.ఆధార్ బ్లాక్ అయిపోతే ఇబ్బంది పడతామన్న కొంతమంది భక్తులు ఆ యువకుడు డిమాండ్ చేసిన డబ్బును చెల్లించినట్టు తెలిసింది. ఇటీవల ఓ భక్తురాలికి ఫోన్ చేసి ఫైన్ కట్టాలని డిమాండ్ చేయడంతో ఆమె నగదు చెల్లించింది.ఆ పరిచయంతో తనకు దర్శనం కావాలని కోరగా చేయిస్తానని నమ్మించిన ఆ యువకుడు నగదు తీసుకుని తర్వాత చేతులెత్తేశాడు. దీంతో ఆ భక్తురాలు విజిలెన్స్‌ను ఆశ్రయించగా విచారణలో ఈ అక్రమం వెలుగు చూసింది. ఆ యువకుడు బెంగళూరులో ఉన్నట్టు గ్రహించిన టీటీడీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఆ భక్తుల వివరాలు అతడి వద్దకు ఎలా చేరాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

## ఆరుగురు డీఎస్పీల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 21: ఆరుగురు డీఎస్పీలు బదిలీ అయ్యారు.నగరి డీఎస్పీగా పనిచేస్తున్న కె. నరసింహమూర్తిని శ్రీకాళహస్తికి, రాజమండ్రి స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ప్రభాకర్‌ను పలమనేరుకు, తిరుపతి ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న రమణకుమార్‌ను తిరుపతి క్రైం విభాగానికి, నెల్లూరు మహిళా స్టేషన్‌లో పనిచేస్తున్న టి. సాయినాథ్‌ను చిత్తూరుకు, కదిరిలో పనిచేస్తున్న ఎం.శ్రీలతను తిరుపతి మహిళా స్టేషన్‌కు డీజీపీ ద్వారకా తిరుమలరావు బదిలీ చేశారు. వీరందరూ తక్షణం పాత స్థానాల్లో రిలీవై కొత్త స్థానాల్లో బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు.

## పంచాయతీల అభివృద్ధికి శ్రీకారం

- రేపు గ్రామ సభల నిర్వహణ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 21: గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రామ సభలు నిర్వహించి, ఉపాధి హామీ పథకం అనుసంధానంతో పనులు చేపట్టేందుకు అవసరమైన తీర్మానాలు చేసేందుకు నిర్ణయించింది. శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తారు. గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలపై చర్చిస్తారు.

# అపోలో వర్సిటీలో ఫుడ్ పాయిజన్




- 300మంది విద్యార్థులకు అస్వస్థత

చిత్తూరు రూరల్, ఆగస్టు 21: చిత్తూరులోని అపోలో యూనివర్సిటీలో సుమారు 300మంది విద్యార్థులు కలుషితాహారంతో అస్వస్థత పాలయ్యారు.అపోలో ఆస్పత్రిలో కొందరికి, చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో మరికొందరు విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారు. విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉండడంతో అపోలో యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. ఎంబీబీఎస్, ఇంజనీరింగ్, నర్సింగ్, పారామెడికల్, ఆర్థో, ఫిజియోథెరపి విభాగాలకు చెందిన సుమారు 1200 మంది విద్యార్థులు చిత్తూరు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. మంగళవారం రాత్రి భోజనం చేసిన విద్యార్థుల్లో కొంత మందికి కళ్ళు తిరగడంతో పాటు జ్వరం, కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలు కావడంతో కళాశాలలోని మెడికల్ సెంటర్‌లో ఉంచి వైద్యం అందించారు. పరిస్థితి కాస్త విషమంగా ఉన్నవారిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఇలా సుమారు 90 మందికి పైగా విద్యార్థులు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. చిత్తూరులో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్యం నిలకడగా ఉందని డీఎంహెచ్‌వో ప్రభావతి తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఈ విషయం తెలిసి డీఎంహెచ్‌వో ప్రభావతికి ఫోన్ చేసి విద్యార్థుల పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పరామర్శించారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల నుంచి ర్యాపిడ్ రెస్పాన్స్ టీం గురువారం చిత్తూరు అపోలో కళాశాలను సందర్శించనుంది.విద్యార్థులతో మాట్లాడి అస్వస్థతకు కారణాలు తెలుసుకుని నివేదిక ఇవ్వనుంది.

## ఇద్దరు కానిస్టేబుళ్ళు, హోంగార్డు సస్పెన్షన్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 21: వెంకటగిరి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్ళు డి. రమణ, మస్తాన్‌లను బుధవారం సస్పెండ్ చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలు జారీ చేశారు.స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులకు న్యాయం చేయకపోగా అక్రమాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలడంతో ఈ చర్యలు తీసుకున్నారు. శ్రీసిటీ స్టేషన్‌లో గతంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు చిన్నతంబి ట్రావెల్స్ స్క్రాప్ ఓనర్ల నుంచి వసూళ్లకు పాల్పడినట్లు తెలియడంతో తిరుపతి ఈస్ట్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇక్కడ కూడా వసూళ్ళకు పాల్పడుతున్నట్లు విచారణలో రుజువు కావడంతో చిన్నతంబిని తాజాగా ఎస్పీ సస్పెండ్ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలో ఎమ్మెల్యే అనుచరులమంటూ కానిస్టేబుల్‌పై దౌర్జన్యం చేసిన ఘటనలోనూ బాధ్యులపై కేసు నమోదు చేయాలని ఆదేశించామన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, ఈ విషయంలో ఎవరికీ మినహాయింపు వుండదన్నారు. పోలీసు విభాగంలో పనిచేసేవారు ఏ చిన్న తప్పు చేసినా క్షమించేది లేదని హెచ్చరించారు.వచ్చే 10 రోజుల్లో బదిలీలు పూర్తయి కొత్త అధికారులు వచ్చిన తరువాత పోలీసు శాఖను ప్రక్షాళన చేస్తానన్నారు.సరిగా పనిచేయని అధికారులు, సిబ్బంది జాబితాను ఇప్పటికే తెప్పించుకున్నామని, వారిలో పరివర్తన కనిపించకపోతే తీవ్రంగా పరిగణిస్తానన్నారు.

## రెవెన్యూ బదిలీలకు కమిటీ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 21: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ అధికారుల, ఉద్యోగుల బదిలీలకు కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, మండల రెవెన్యూ అధికారి, టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (గ్రేడ్-1, 2) బదిలీలకు కమిటీ అధ్యక్షుడిగా ఉమ్మడి చిత్తూరు జిల్లా నోడల్ అథారిటీగా ఉన్న కలెక్టర్ సుమిత్‌కుమార్, సభ్యుడిగా తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. చిత్తూరు జిల్లా పరిధిలో బదిలీలకు ఏర్పడిన కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్, సభ్యుడిగా జేసీ, కన్వీనర్‌గా డీఆర్వో వ్యవహరిస్తారు. తహసీల్దార్, వీఆర్వోల బదిలీలను ఈ కమిటీ నిర్వహిస్తుంది. డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, ఎంఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టుల బదిలీలకు జేసీ అధ్యక్షతన మరో కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీలో సభ్యులుగా డీఆర్వో, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఉంటారు.

## ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 21:ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వెనక్కితీసుకోవాలని,క్రీమీలేయర్ ద్వారా రిజర్వేషన్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని తిరుపతి అంబేద్కర్ భవన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పరమశివం, నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ పిలుపునిచ్చిన బంద్‌ను జిల్లాలో జైభీమ్, జైభారత్ దళిత సంఘాలు, బీఎస్పీ , అంబేద్కర్ కమిటీ, మాలమహానాడు, మహాసభ, వివిధ దళిత సంఘాల నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీలను విభజించే కుట్రకు బీజేపీ పాల్పడుతోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా తిరుపతి ఆర్టీసీ బస్టాండు ముందున్న అంబేద్కర్ విగ్రహ కూడలిలో నిరసన ర్యాలీ చేశారు. ట్రాఫిక్ స్తంభించడంతో ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీసీ అధికారులు వాహనాలను కాసేపు దారిమళ్లించారు.అంతకుముందు ఈస్ట్‌పోలీస్‌స్టేషన్, రైల్వే స్టేషన్, కర్నాలవీధి మీదుగా ఎన్టీఆర్ కూడలి, జ్యోతిరావుపూలే విగ్రహం, ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ, ఎస్వీ యూనివర్శిటీ, పద్మావతి కాలేజ్, మహిళా యూనివర్శిటీ మీదుగా దళిత సంఘాల నేతలు ర్యాలీ నిర్వహించారు.అంబేడ్కర్ భవన్ ట్రెజరర్ మురళి, ఇంద్రముని, ధనశేఖర్, ప్రసాదరావు, రాధాకృష్ణ, చెన్నకేశవులు, సురేష్‌కుమార్, రాజేష్‌కుమార్, చిరంజీవి, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.





తిరుపతి బస్టాండులో మోహరించిన పోలీసులు

## బంద్ ప్రభావం నిల్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ పిలుపున్చిన బంద్ ప్రభావం బుధవారం పెద్దగా కనిపించలేదు.వర్తక, వాణిజ్య సంస్థలు వ్యాపారాలు కొనసాగించగా విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు యధావిధిగా పనిచేశాయి. రైళ్ళు ,ఆర్టీసీ బస్సుల రాకపోకలు యధావిధిగా కొనసాగాయి. తిరుపతిలో కొన్ని విద్యాసంస్థలకు ముందుగా సెలవు ప్రకటించిన యాజమాన్యాలు మళ్ళీ బుధవారం ఉదయం సెలవు లేదని మెసేజ్ పెట్టాయి. ఎక్కడైనా అవాంచనీయ ఘటనలు చోటు చేసుకుంటాయన్న అనుమానంతో ఎక్కడికక్కడ పోలీసులు రోడ్లపై మోహరించారు.అనుమానం వున్న వారిని విచారించి పంపారు.బ్యాంకుల వద్ద భద్రత ఏర్పాటు చేశారు.ఎస్పీ సుబ్బరాయుడు తిరుపతిలో కొన్ని ప్రాంతాల్లో తిరిగి బంద్ ప్రభావాన్ని పరిశీలించారు.

# నీటి వినియోగంపై టీటీడీ ఆంక్షలు



మూడు కొళాయిల్లో ఒకటి బంద్

- తిరుమలలో ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు
- హోటళ్లకు ఇకపై ఎనిమిది గంటలే సరఫరా
- అదనంగా కావాలంటే నుంచి తిరుపతి నుంచి తెచ్చుకోవచ్చు


తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో నీటి వినియోగంపై టీటీడీ ఆంక్షలు విధించింది. భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు, భక్తులకు నీటి కొరత ఏర్పడకుండా చూసేందుకు హోటళ్లకు, మఠాలకు, స్థానికులకు ఇకపై నీటి సరఫరా నిరంతరం ఉండదంటూ ఉత్తర్వులు జారీ చేసింది. తిరుమల అవసరాలకు రోజూ దాదాపు 40 లక్షల గ్యాలన్ల నీరు అవసరం. ఈ నీటిని పాపవినాశనం, కుమారధార, పసుపుధార, గోగర్భం, ఆకాశగంగ డ్యాముల నుంచి తీసుకుని శుద్ధి అనంతరం సరఫరా చేస్తుంటారు. 14,304 లక్షల గ్యాలన్ల నీటి సామర్థ్యం ఉన్న ఈ డ్యాముల్లో ప్రస్తుతం నీళ్లు సగానికి పైగానే ఉన్నాయి. అయితే వర్షాలు తక్కువగా పడడం, రాబోయే రోజుల్లో వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయనే అంచనా వేసిన టీటీడీ ప్రస్తుతం ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని భావిస్తోంది.ఏడెనిమిదేళ్ల క్రితం అమలు చేసిన నీటిపొదుపు చర్యలను పరిశీలించి వాటినే పాటించాలని భావించి నీటి నియంత్రణ నిబంధనలను ఈ నెల మొదటి వారంలో ఇంజినీరింగ్ వాటర్‌వర్క్స్ విభాగం విడుదల చేసింది.తిరుమలలోని హోటళ్లు, జనతా క్యాంటీన్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు టీటీడీ వాటర్‌వర్క్స్ విభాగం 24 గంటల పాటు నీటిని సరఫరా చేస్తోంది. ఈనెల 25వ తేదీ నుంచి ఉదయం 6 నుంచి 10 గంటలకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు మొత్తం ఎనిమిది గంటల పాటు మాత్రమే నీటిని సరఫరా చేయనున్నట్లు నోటీసులను హోటళ్ల నిర్వాహకులకు అందజేసింది.అదనపు నీరు కావాలంటే విజిలెన్స్ అనుమతితో తిరుపతి నుంచి ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా తెచ్చుకోవచ్చని సూచించింది.మఠాలకు కూడా ఇదే తరహాలో ఆంక్షలు విధించారు. తిరుమలలోని అన్నప్రసాదభవనం, ముఖ్యప్రాంతాల్లోని నీటి కుళాయి కేంద్రాలు, కాటేజీల్లో నీటి వినియోగాన్ని తగ్గించే ప్రణాళికలు కూడా సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జలప్రసాదాల్లో కొన్ని నీటి కుళాయిలను మూసివేశారు. నాలుగు కుళాయిలున్న చోట రెండు,ఐదు కుళాయిలున్న చోట మూడింటికి కుదించారు.పలు ప్రాంతాల్లో జరుగుతున్న కాటేజీల నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్టర్లకు కూడా నిబంధనలు పెట్టారు.తిరుపతి నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకోమని సూచించారు.

### బాలాజీనగర్‌కు ఆరు రోజులకోసారి

నీటిపొదుపులో భాగంగా తిరుమలలో స్థానికులు నివసించే బాలాజీనగర్‌కు ఆరు రోజులకోసారి మాత్రమే నీటిని విడుదల చేస్తామని టీటీడీ ప్రకటించడంతో స్థానికుల్లో భయం మొదలైంది.ఇక్కడ మొత్తం 1,060 ఇళ్లుండగా దాదాపు 10 వేలమంది నివాసముంటున్నారు. ఆరు రోజులకోసారి నీళ్లు విడుదల చేస్తే వంటకు కూడా ఇబ్బందిపడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. మూడురోజులకు ఓసారైనా నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.

### 4 నెలలకు మాత్రమే నీళ్లున్నాయ్: టీటీడీ

తిరుమలలో నీటి అవసరాలను తీర్చడానికి ఐదు ప్రధాన డ్యాముల్లో ప్రస్తుతమున్న నీరు 120 నుంచి 130 రోజులు మాత్రమే సరిపోతాయని టీటీడీ బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. తిరుమలలోని డ్యాముల్లో 5,800 లక్షల గ్యాలన్ల నీరు మాత్రమే అందుబాటులో ఉందని, రానున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నీటి వినియోగాన్ని నియంత్రించేందుకు కొన్ని చర్యలు తీసుకుంటున్నట్లు టీటీడీ పేర్కొంది.



బాలాజీనగర్

## జెన్‌ప్యాక్ట్‌లో 1500 ఉద్యోగాలు : కలెక్టర్

తిరుపతి(విద్య), ఆగస్టు 21: ప్రముఖ ఐటీ కంపెనీ జెన్‌ప్యాక్ట్‌లో 1500 ఉద్యోగాలకు బీటెక్, డిగ్రీ ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. ఈ ఉద్యోగాల భర్తీ కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను కంపెనీ ప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ... కంటెంట్ మోడరైజేషన్, కస్టమర్ సర్వీస్ - వాయిస్ సపోర్ట్ విభాగాల్లో 1500 ఉద్యోగాలు ఉన్నట్టు వివరించారు. ఏదేని గ్రూప్‌లో బీటెక్ లేదా ఏదేని డిగ్రీ 2022, 2023, 2024 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఉద్యోగం హైదరాబాద్‌లో కల్పిస్తారని, యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు ముందుగా జ్టిఇట//ఛ్టీ.జూఴ46గ్ని6 లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 28వ తేదీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ. రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్న అభ్యర్థుల అర్హతను పరిశీలించి వారిని ఇంటర్వ్యూకు అనుమతిస్తారు. ఎప్పుడు ఎక్కడ ఇంటర్వ్యూ జరుగుతుందనే వివరాలను రిజిస్ట్రేషన్ తరువాత తెలియజేస్తారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం తెలిపారు. ఇతర వివరాలకు 99888 53335 సెల్ నెంబరులో సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో ఏడీఎస్డీ మురళీకృష్ణ, డీపీఓ గణేష్, కోఆర్డినేటర్లు దిలీప్, మహేష్ పాల్గొన్నారు.

## సైన్స్‌పట్ల అవగాహన పెంచుకోండి

గూడూరు, ఆగస్టు 21: విద్యార్థి దశ నుంచే సైన్స్‌పట్ల అవగాహన పెంచుకోవాలని జేవీవీ పట్టణ అధ్యక్షుడు వి.రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం స్వర్ణాంధ్రభారతి కళాశాలలో జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మూఢనమ్మకాలపై పరీక్షలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. దొంగ స్వామిజీలను నమ్మవద్దని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో నిరంజన్‌రెడ్డి, నాగరాజు, రామ్మోహన్, ఆనంద్, సుబ్బారావు, రాధయ్య, సుమన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## 24న కృష్ణాష్టమి వేడుకలు

గూడూరు, ఆగస్టు 21: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన పట్టణంలో నిర్వహించనున్న శ్రీకృష్ణజన్మదిన వేడుకలను, విశ్వహిందూ పరిషత్ స్థాపన దినోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక వీహెచ్‌పీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వహిందూపరిషత్ ఏర్పాటు చేసి 60 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఈనెల 24న నిర్వహించనున్న కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మురళీరెడ్డి, వెంకటరమణయ్య, ఆర్‌వీరావు, బ్రజేంద్రరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, రామయ్య, రవిచంద్ర, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

గూడూరు/ వెంకటగిరి, ఆగస్టు 21: విద్యార్థినులు హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలని ఎన్ఎన్‌పీ సంస్థ అధ్యక్షురాలు ధనుర్జ అన్నారు. డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో జరిగిన హెచ్ఐవీపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ నేటి యువత చేడు అలవాట్లకు బానిసలు కాకుండా నైతిక విలువలను పాటించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, సంస్థ సభ్యులు దామోదర్, వెంకటేశ్వర్లు, శాంతి, శుభాషిణి తదితరులు పాల్గొన్నారు. వెంకటగిరి పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాలల్లో నవజీవన్ ఆర్గనైజేషన్-సీసీ-టీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం సీహెచ్‌సీ ఎల్‌టీ సుజిత్‌కుమార్ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ లక్షణాలు, అవి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితరాలను వివరించారు. టోల్ ఫ్రీ నెం.1097ను సంప్రదిస్తే పూర్తి వివరాలు తెలుపుతారన్నారు. కె. బాలాజీ, కవిత, కల్పన, శిరీష, నళిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళకు కుట్టు మెషిన్ వితరణ

గూడూరు అర్బన్, ఆగస్టు 21: స్థానిక ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో బుధవారం సేవాసంస్థ ఆధ్వర్యంలో మహిళకు కుట్టు మెషిన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కే.చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన ఆషా అనే గిరిజన మహిళకు జీవనోపాధి కల్పించేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో కుట్టు మెషిన్ అందజేశామన్నారు. కార్యక్రమంలో మయూరి శ్యామ్‌యాదవ్, శ్రీనివాసులు, ప్రభాకర్, శివకుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

గూడూరు అర్బన్, ఆగస్టు 21: స్థానిక వీరారెడ్డిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్నారులకు భోజనం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్, శ్రీనివాసులు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు


అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాశిం

గూడూరు, ఆగస్టు 21: ప్రజలు అందజేసే సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అందజేసే సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరి స్తున్నానన్నారు. ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ పరిధిలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటుచేస్తే తక్కువ ధరలకు అందుబాటులో వస్తుందని, దీంతో కార్మికులకు జీవనోపాధి మెరుగుపడుతుందని చెప్పారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వారికి తెలిపారు.

## న్యాయం చేయాలని ప్రియుడి ఇంటిముందు యువతి ఆందోళన


గూడూరు, ఆగస్టు 21: ప్రేమించి మోసం చేశాడని తనకు న్యాయం చేయాలని ఓ యువతి బుధవారం ప్రియుడి ఇంటిముందు ఆందోళన చేపట్టిన సంఘటన గూడూరు అరుంధతీయపాళెంలో చోటు చేసుకుంది. స్థానిక అరుంధతీయపాళెంకు చెందిన ఓ యువతి అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి మోసం చేశాడని పేర్కొంది. ప్రస్తుతం వేరే యువతితో తాను ప్రేమించిన యువకుడు వివాహం చేసుకోవాలని చూస్తున్నాడని దీంతో తనకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగింది.

## అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ


విచారణ జరుపుతున్న డీఎస్పీ

పెళ్లకూరు, ఆగస్టు 21: మండలంలోని కానూరు రాజుపాళెం గిరిజనులపై శిరసనంబేడు రాజుపాళేనికి చెందిన రాజా వేధించడమే కాకుండా దాడి చేసిన ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ మేరకు బుధవారం నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు రెవెన్యూ అధికారులతో కలసి కానూరు రాజుపాళెం గిరిజన కాలనీకి వెళ్లి బాధితులను విచారించారు. ఈ సందర్భంగా ఇటుక బట్టీల యజమాని తమను వేధించడంతో పాటు దాడికి పాల్పడి శ్రీనివాసులును నిర్బంధించిన విషయాన్ని డీఎస్పీకి తెలిపారు. అనంతరం నిర్బంధానికి గురైన శ్రీనివాసులును వెంటబెట్టుకుని శిరసనంబేడు రాజుపాళెం వద్ద ఉన్న ఇటుక బట్టీల వద్దకు చేరుకున్నారు. అలాగే నిందితుడు రాజు ఇంటికి వెళ్లగా, ఆయన అందుబాటులో లేడని కుటుంబీకులు చెప్పారు. అనంతరం శ్రీనివాసులును నిర్బంధించిన స్థలాన్ని పరిశీలించారు. డీఎస్పీ వెంట ఆర్ఐ సంతోబాయి, వీఆర్వో సుమతి తదితరులు ఉన్నారు.

## ఎస్ఐ సురేష్‌బాబు బాధ్యతల స్వీకారం



చిల్లకూరు, ఆగస్టు 21: చిల్లకూరు ఎస్ఐగా బుధవారం సురేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ సుధీర్‌కుమార్ పల్నాడు జిల్లా దుర్గికి బదిలీ అయ్యారు. దీంతో నెల్లూరు సైబర్ క్రైం విభాగంలో విధులు నిర్వహిస్తున్న సురేష్‌బాబు చిల్లకూరుకు బదిలీ కావడంతో బాధ్యతలు చేపట్టారు.

## నేడు లింగవరంలో భూ సర్వే గ్రామసభ

చిల్లకూరు, ఆగస్టు 21: మండలంలోని లింగవరం సచివాలయంలో గురువారం 10గంటలకు తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో సర్వేచేసిన భూములకు సంబంధించి గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. గత నెల 24వ తేదీ నుంచి తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ, లింగవరం, పల్లివానిదిబ్బ, తీగపాళెం, తాళ్లబైట, గోనుగుంట గ్రామాల్లోని భూములను సర్వే చేశామన్నారు. గ్రామసభలో సాగుదారుల వివరాలను తెలిజేస్తామన్నారు. ఆయా గ్రామాల్లోని సాగుదారులు పాల్గొని వారి అభ్యంతరాలను తెలియజేయాలని తహసీల్దారు కోరారు.

## ఊపందుకున్న భవన నిర్మాణ రంగం

- జోరుగా వివిధ భవనాల నిర్మాణం
- కూలీలకు చేతినిండా పని



వినాయకుడి గుడి వద్ద పనులకు వచ్చిన భవన నిర్మాణ కూలీలు- భవన నిర్మాణ పనులు

సూళ్లూరుపేట, ఆగస్టు 21: గత వైసీపీ ప్రభుత్వ పాలనలో కుదేలైన భవన నిర్మాణ రంగం మళ్లీ ఊపందుకుంది. నిర్మాణ కార్మికులకు చేతి నిండా పని దొరుకుతోంది. గతంలో వీరంతా పనులు లేక పూట గడవని స్థితిలో అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తోంది. జూలై 8 నుంచి ఇసుకపై కొత్త విధానం అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి సూళ్లూరుపేట పట్టణంతో పాటు, మండలంలో భవన నిర్మాణాలు మొదలయ్యాయి. ఇతర నిర్మాణ పనులు జోరందుకున్నాయి. గతంలో సూళ్లూరు పేటతో పాటు మండలంలో పలు గ్రామాలనుంచి నిర్మాణ కార్మికులు పనుల కోసం వేచి ఉండేవారు. చాలా మందికి పనులు దొరక్క నిరాశతో ఇళ్లకు వెను తిరిగేవారు. ఇసుక సరిగ్గా దొరకక గృహ యజమానులూ ఇబ్బంది పడేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలు ఉండేది. దీంతో చాలా మంది ఇసుక కొనుగోలు చేయలేక నిర్మాణాలను మధ్యలోనే ఆపేశారు. దీంతో నెల పొడవునా భవన నిర్మాణ కార్మికులకు సక్రమంగా పని దొరికేది కాదు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక కొత్త విధానంతో అటు యజమానులు, ఇటు కార్మికులు సంతోషంగా ఉన్నారు. తాపీ మేస్త్రీలు, సెంట్రింగ్, ప్లంబర్, పెయింటింగ్, వడ్రంగి కూలీలకు ఇప్పుడు డిమాండ్ పెరిగింది. వారంతా ఉదయం లేచి పను లకు వెళ్లి నాలుగు డబ్బులు సంపాదించుకుంటున్నారు.

## వర్గీకరణ తీర్పును పునఃపరిశీలించాలి: మాల మహానాడు


గూడూరు టవర్‌క్లాక్ వద్ద, నాయుడుపేట అంబేద్కర్ బొమ్మ సమీపంలో మాల మహానాడు నాయకుల ధర్నా - వెంకటగిరిలో మూతపడ్డ ఎస్బీఐ

గూడూరు, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును పునఃపరిశీలించేలా చర్యలు తీసుకోవాలని మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు సుముఖం వ్యక్తం చేస్తూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం మాలమహానాడు పిలుపునిచ్చిన భారత్‌బంద్ పట్టణంలో పాక్షికంగా జరిగింది. పలు ప్రైవేటు పాఠశాలకు మందస్తుగా సెలవు ఇచ్చారు. టవర్ క్లాక్ సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మాలమహానాడు నాయకులు మాట్లాడుతూ... రాష్ట్రంలో మాలలు, మాదిగలు అన్నదమ్ములుగా కలిసిమెలిసి జీవిస్తున్న తరుణంలో ఎస్సీ వర్గీకరణ పేరుతో వారిని విడదీసేందుకు చేస్తున్న ప్రయత్నాలు సరైనవి కాదన్నారు. జి.శివకుమార్, అరవ పార్వతయ్య, కే.ఆర్.దాసరి, ఎన్.భాస్కర్ గౌడ్, బాబయ్య, హరి, చింతలబాబు తదితరులు పాల్గొన్నారు.

### బంద్ పాక్షికం

**వెంకటగిరి టౌన్:** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వెంకటగిరి పట్టణంలో మాల మహానాడు నిర్వహించిన బంద్ పాక్షి కంగా జరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, బ్యాంక్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. ధనంజయ, జాన్, సురేష్, పెంచలయ్య, ఆంజనేయులు, రాజేష్, జయకర్, డీవిడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**నాయుడుపేట టౌన్:** పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీయులు నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ సీఐ బాబి సిబ్బందితో కలసి చర్యలు చేపట్టారు.

**సూళ్లూరుపేట:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును నిరసిస్తూ మాల మహానాడు జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుంచి బజారు వీధుల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని డీటీ చైతన్యకి వినతిపత్రం అందజేశారు. చంద్రశేఖర్, చిన్న, కిషోర్, మునిరత్నం, చెంగయ్య, కుదిరి గోపి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**చిట్టమూరు:** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రిజర్వేషన్ బచావో సంఘర్ష సమితి ఇచ్చిన పిలుపు మేరకు బంద్ చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మూత పడ్డాయి. అనంతరం కొత్తగుంట కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. బి.శ్రీను, పి.వెంకటరమణ, ఎ.సురేష్, కె.రమేష్, మురళి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## హంతకులను బహిరంగంగా ఉరితీయాలి


కూటమి ఆధ్వర్యంలో జరిగిన నిరసన ర్యాలీ

కోట, ఆగస్టు 21: కోల్‌కతా నగరంలో వైద్య విద్యార్థినిని హత్యాచారం చేసిన నిందితులను బహిరంగంగా ఉరితీయాలని పలు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. మండల పరిధిలోని విద్యానగర్‌లో బుధవారం రాత్రి కూటమి ఆధ్వర్యంలో విద్యార్థులు, నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జనసేన నాయకులు నయీం, అల్లంబాబు, టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ టి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక ఇంజనీరింగ్ కళాశాల నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. గాంధీ బొమ్మకు వినతిపత్రం సమర్పించారు. నిందితులను శిక్షించడంతోపాటు బాధితురాలి కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలంటూ డిమాండ్ చేశారు. అంతకుముందు కోటలోని ప్రగతి విద్యా సంస్థల విద్యార్థులతో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. పసుపులేటి కిషోర్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

## పుష్పిత్‌స్టీల్‌లో బిహార్ కార్మికుడి మృతి


మృతి చెందిన మహమ్మద్ ఆర్మాన్

ఏర్పేడు, ఆగస్టు 21: ఏర్పేడు మండలం మేర్లపాక వద్ద ఉన్న పుష్పిత్‌స్టీల్ కర్మాగారంలో బిహార్‌కు చెందిన కార్మికుడు మృతి చెందాడు. బిహార్ రాష్ట్రం ఆరారియా జిల్లా రాంనగర్ పంచాయతీకి చెందిన మహమ్మద్ ఆర్మాన్(22) రెండేళ్ల క్రితం పుష్పిత్‌స్టీల్స్ కర్మాగారంలో పనిచేయడానికి వచ్చాడు. కర్మాగార ఆవరణలో ఉన్న క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి 10 గంటలకు విధులకు వెళ్లాడు. బుధవారం ఉదయం 6 గంటలకు డ్యూటీ నుంచి రూమ్‌కు రావాల్సిన మహమ్మద్ ఆర్మాన్ 9 గంటలైనా రాకపోవడంతో తోటి కార్మికులు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ పనిచేస్తున్న అధికారులు కార్మికులతో కలిసి కర్మాగారం లోపల గాలించగా వాటర్‌కూలింగ్ కాంప్లెక్సులో పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మహమ్మద్ ఆర్మాన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కొరియర్ కార్యాలయంలో మంటలు



నాయుడుపేట టౌన్, ఆగస్టు 21: పట్టణంలోని భరత్‌నగర్‌లో కొరియర్ కార్యాలయంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికుల కథనం మేరకు.. కొరియర్ కార్యాలయాన్ని బుధవారం రాత్రి ఎప్పటిలాగే నిర్వాహకులు మూసివేసి ఇంటికి వెళ్లారు. కొంత సమయం తరువాత కార్యాలయం నుంచి మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల వారు గుర్తించి పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే కొరియర్ కార్యాలయంలో ఉన్న సామగ్రి దగ్ధమైంది.

## పేద విద్యార్థులకు అండగా ఉంటాం

కోట, ఆగస్టు 21 : ప్రతిభా పాటవాలు కలిగి చదువుకోవాలన్న తపన ఉన్న ప్రతి పేద విద్యార్థికి అండగా ఉంటామని శ్రీ షిర్డీ సాయి అక్షయ సేవా సమితి అధ్యక్షుడు రమణయ్య చెప్పారు. కోటలోని సమితి కార్యాలయంలో బుధవారం చిట్టమూరు మండలం మెట్టు గ్రామానికి చెందిన డి.సౌమ్యకు రూ.10 వేల చెక్కును అందజేశారు. సౌమ్యకు ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ సీట్ వచ్చింది. ఈక్రమంలో తనకు బిల్డింగ్, వ్యాన్ ఫీజులు చెల్లించాలంటూ సౌమ్య సమితిని ఆశ్రయించింది. ట్రస్టు ప్రతినిధులు వెంకటరమణారెడ్డి, నాగూర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## గురుకులాలలో అధికారుల బృందం

కోట, ఆగస్టు 21 : మండలంలోని చిట్టేడు యానాదుల గురుకుల జూనియర్ కళాశాల, పాఠశాలలను బుధవారం అధికార బృందం సందర్శించింది. ఎంపీడీవో భవానీ, ఎంపీపీ అంజమ్మ పలువురు వైద్యాధికారులు వసతులను పరిశీలించారు. అదే విధంగా పారిశుధ్యాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల భోజనాలు, నీటిని పరిశీలించారు. ఆయా పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌కు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

## ప్రకృతి వ్యవసాయంతో భూములకు జీవం

వెంకటగిరి టౌన్, ఆగస్టు 21: ప్రకృతి వ్యవసాయంలో భూములకు జీవం వస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య అన్నారు. బుధవారం కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచక్షణా రహితంగా రసాయన ఎరువుల వినియోగంతో భూములు సారాన్ని కోల్పోతున్నాయని చెప్పారు. దీనికి ప్రత్యమ్నాయంగా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు. ఉద్యానవన పంటలపై దృష్టి పెడితే అధిక దిగుబడులు సాధించి లాభసాటిగా ఉంటుందన్నారు.

## గందరగోళం నడుమ కోస్టల్ కారిడార్ భూముల తీర్మానం


గ్రామసభలో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

కోట, ఆగస్టు 21: చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్‌లో భూములు కోల్పోయే రైతులకు పరిహారం చెల్లించే విషయంలో అప్పటి వైసీపీ నాయకులు బినామీలను రైతులుగా చేర్చారని తక్షణం వాటిపై దృష్టి సారించాలంటూ టీడీపీ నాయకులు పట్టుబట్టారు. కోట మండలం కొత్తపట్నం సచివాలయంలో బుధవారం చెన్నై, బెంగుళూరు కోస్టల్ కారిడార్ కోసం కేటాయించిన 444 ఎకరాలకు సంబంధించి అభ్యంతరాలపై గ్రామసభ నిర్వహించారు. తహసీల్దారు జయజయరావు, డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున రావు, మండల సర్వేయర్ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామసభలో టీడీపీ, వైసీపీ మద్దతుదారులైన రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. ఒక వర్గం రైతులు న్యాయం చేయాలని పట్టుబట్టగా మరో వర్గం పరిశ్రమలను వ్యతిరేకిస్తామంటూ హెచ్చరించారు. అటు తరువాత అధికారుల జోక్యంతో రెండు వర్గాల రైతులు గ్రామసభలో అభ్యంతరాలు లేవని చెప్పడంతో అధికారులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో వీఆర్వోలు శ్రీనివాసులు, రమణయ్య, సుబ్రహ్మణ్యం, పలువురు మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.4,30,988



నాయుడుపేట టౌన్, ఆగస్టు 21: పట్టణంలోని గడియారంసెంటర్ వద్ద కొలువై ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. రెండు నెలలా 22 రోజులకు గాను రూ 4,30,988 వచ్చినట్లు ఈవో శశాంక్ తెలిపారు. అలాగే అమ్మవారి చీరల వేలం ద్వారా రూ. 6,301 వచ్చినట్లు ఆయన తెలిపారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు



చిల్లకూరు, ఆగస్టు 21: మండలంలోని కోటక్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని రెట్టపల్లికి చెందిన చెంగయ్య, కోటేశ్వరరావు బైక్‌పై కడివేడు నుంచి గ్రామానికి వెళుతూ కోట క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో నాయుడుపేట నుంచి నెల్లూరుకు వెళ్తన్న ఆర్టీసీ బస్సు ఢీకొనింది. దీంతో బైక్‌పై వెళుతున్న ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కోటేశ్వరరావును మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారన్నారు.

## పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

చిల్లకూరు, ఆగస్టు 21: రాజీ పడకుండా నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలని తహసీల్దారు శ్రీనివాసులు చెప్పారు. బుధవారం స్థానిక డానియల్ చిల్డ్రన్స్ హోంలోని వంటగది, మరుగుదొడ్లు, వసతి గదులను ఎంఈవో రఫూఫ్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హోంలోని పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. మరుగుదొడ్లు, వంటగది, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిల్లల ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో రమణయ్య, వాసుదేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెస్ట్ రిజర్వేషన్ కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకురండి

గూడూరు, ఆగస్టు 21: స్థానిక రైల్వేస్టేషన్‌లోని పడమర వైపు నిర్మించి ఉన్న రిజర్వేషన్ కౌంటర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మాజీ ఎంపీ వరప్రసాద రావు కోరారు. బుధవారం విజయవాడలోని రైల్వే డీఆర్ఎం నరేంద్రపటేల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ... రైల్వేస్టేషన్‌లోని పడమరవైపు రెండో పట్టణ ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా రిజర్వేషన్ కౌంటర్ నిర్మించారన్నారు. ఇప్పటి వరకు కౌంటర్‌ను ప్రారంభించలేదన్నారు. అదే విధంగా గూడూరు ఒకటి, రెండో పట్టణానికి రాకపోకలు సాగించేందుకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయించడానికి కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

## ఉపాధ్యాయనగర్ కాలనీలో పార్కు

### ఎమ్మెల్యే కురుగొండ్ల


9వ వార్డులో ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వెంకటగిరి, ఆగస్టు 21: పట్టణంలోని ఉపాధ్యాయనగర్ కాలనీవాసులకు ఆహ్లాదకరమైన పార్కును త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం చెవిరెడ్డిపల్లి చెరువు సహా ప్రభుత్వ భూముల ఆక్రమణలను పరిశీలించారు. చెవిరెడ్డిపల్లి చెరువు ఆక్రమణలను తొలిగించాలని ఆయన ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా ప్రభుత్వ భూములను కబ్జా చేశారని వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, పి.రాజేశ్వరరావు, బి.రాజేశ్వరరావు, కె.శ్రీనివాసులు నాయుడు, ఎ. సత్యనారాయణ, బాబునాయుడు, మల్లాం బాబు, తహసీల్దార్ మునిలక్ష్మి తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## శ్మశానాన్ని ఆక్రమిస్తే చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో

చిల్లకూరు, ఆగస్టు 21: శ్మశానాన్ని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం చిల్లకూరు పట్టణంలోని సర్వే నెం.107లో శ్మశానాన్ని ఆయన పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెం.107లో 8.60 ఎకరాల్లో శ్మశానం ఉందన్నారు. ఈ భూమి కొంతమేర ఆక్రమణకు గురైనట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో శ్మశానాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశామన్నారు. ఆయన వెంట తహసీల్దారు శ్రీనివాసులు, వీఆర్‌వో రమణయ్య, సర్వేయర్ తరుణ్ తదితరులు ఉన్నారు.

## షార్ విశ్రాంత ఉద్యోగులకు సన్మానం


సన్మాన గ్రహీతలతో సీఐ మురళీకృష్ణ

సూళ్లూరుపేట, ఆగస్టు 21: పట్టణంలోని డీఆర్‌డీఎస్ షార్ కాలనీ క్లబ్ ఆవరణలో బుధవారం వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్, రిటైర్డ్ షార్ ఉద్యోగులు పాల్గొన్నారు. వీరిలో 75 సంవత్సరాలు నిండిన 20 మంది షార్ విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. ముఖ్య అతిథిగా సీఐ మురళి కృష్ణ విచ్చేసి సీనియర్ సిటిజన్లు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కుమారస్వామి, ఆదిశేషారెడ్డి, ప్రేమనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెడు అలవాట్లకు దూరంగా ఉండండి


సదస్సులో సూచనలిస్తున్న అదనపు న్యాయమూర్తి అనూష

సూళ్లూరుపేట, ఆగస్టు 21: మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దనని సూళ్లూరుపేట సివిల్ జడ్జికోర్టు అదనపు న్యాయమూర్తి ఎస్.అనూష యువతకు సూచించారు. బుధవారం స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు.విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లను అలవర్చుకుంటే భవిష్యత్తులో అనుకున్నది సులువుగా సాధించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, అధ్యాపకులు ఉషారాణి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

దక్కిలి, ఆగస్టు 21: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు గూడూరులో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ప్రసన్న కుమారి తెలిపారు. ఈ మేరకు క్రీడల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు బుధవారం క్రీడా దుస్తులను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎప్పుడూ విధి నిర్వహణలో తలమునకలై ఉండే ఉపాధ్యాయులు అప్పుడప్పుడూ ఇలా క్రీడాపోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. క్రీడల వల్ల మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. ఎంఈవోలు జగదీష్ బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

## 60 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



తడ, ఆగస్టు 21 : రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారంటూ పోలీసులకు సమాచారం అందింది. సోమవారం రాత్రి అక్కంపేట జాతీయ రహదారి వద్ద లగేజీ ఆటోలో బియ్యం తరలి వెళ్తుండగా గుర్తించి పట్టుకున్నారు. డ్రైవర్‌ను, వాహనాన్ని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అందులో తనిఖీ చేయగా సుమారు రూ.1.10 లక్షలు విలువైన 60 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లుగా గుర్తించారు. ఈ మేరకు బియ్యాన్ని గోదాముకు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నరసింహారావు తెలిపారు.

## భూ ఆక్రమణ అడ్డగింత

తడ, ఆగస్టు 21: కోర్టు పరిధిలో ఉన్న భూ ఆక్రమణకు యత్నించగా అడ్డుకున్నామని తహసీల్దారు శరత్‌బాబు తెలిపారు. తడకండ్రిగ పంచాయతీ సర్వే నెం.89/5లో సుమారు 1.97 ఎకరాల ప్రభుత్వ భూమిపై సర్వే సెటిల్‌మెంట్ కోర్టులో కేసు నడుస్తోంది. మంగళవారం కొందరు ఆ భూమిని చదును చేయిస్తున్నదానిని అధికారులు గుర్తించారు. ఈ మేరకు బుధవారం భూమిని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.